

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గద్దమీది బాలరాజు | బుధవారం 23-04-2025 | సంపుటి - 22 | సంచిక - 358 | రూ : 4 | పేజీలు: 8


## ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపు

- భూభారతి, గృహ నిర్మాణంపై కలెక్టర్లు దృష్టి పెట్టాలి
- మంత్రి పొంగులేటి ఆదేశం
- ఎల్ఆర్ఎస్ గడువు పెంచేది లేదని స్పష్టీకరణ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం

2లో





## పర్యాటకులపై పంజా

- చనిపోయిన వారిలో హైదరాబాద్ వాసి, కర్ణాటక వ్యాపారి..
- క్షతగాత్రుల్లో మహారాష్ట్ర, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వాసులు
- సైనిక దుస్తుల్లో వచ్చి కాల్పులు జరిపిన దుండగులు
- పహల్గాం పట్టణానికి 6 కి.మీ. దూరంలో దారుణం
- రక్తసిక్తమైన మినీ స్విట్జర్లాండ్
- ఇది అత్యంత ఘాతుకం...
- తీవ్రంగా ఖండించిన ముర్ము, మోదీ, ట్రంప్, పుతిన్ సహా పలువురు నేతలు

2లో

## జపాన్ పెట్టుబడులు.. రూ.12,062 కోట్లు!

- రాష్ట్రంలో దాదాపు 30 వేల ఉద్యోగావకాశాలు
- పలు దిగ్గజ కంపెనీలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు
- హిరోషిమా ఉపగవర్నర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి బృందం భేటీ
- ఏడు రోజుల పర్యటన ముగించుకొని నేడు రాష్ట్రానికి..

2లో



## ఉక్రెయిన్‌తో ద్వైపాక్షిక చర్చలకు సిద్ధం

* తొలిసారి స్పందించిన పుతిన్

2లో






## హజ్ యాత్రికులకు సదుపాయాలు కల్పించాలి

- 11 వేల మంది హజ్ యాత్రికులు
- గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు నిబద్ధతతో పనిచేయాలి
- రాష్ట్రస్థాయి సమన్వయ సమావేశం నిర్వహణ
- సమస్యలను నివృత్తికై హెల్ప్ డెస్క్ ఏర్పాటు
- మైనార్టీ సంక్షేమ శాఖ సంచాలకులు షేక్ యాస్మిన్ భాష

2లో

## పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు సాయం చేయండి

- కర్నూలులో హైకోర్టు బెంచ్ త్వరగా ఏర్పాటు చేయండి
- పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధిలో వేగం పెంచండి
- కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, అర్జున్‌రామ్, పీయూష్ గోయల్‌లకు సీఎం చంద్రబాబు వినతులు
- హోంమంత్రి అమిత్ షాతో రాజకీయ అంశాలపై చర్చ

2లో



## సివిల్స్ తొలి 100 ర్యాంకర్లలో ఐదుగురు మనవాళ్లు

- వరంగల్‌కు చెందిన సాయిశివానికి 11వ స్థానం
- ఏపీ అభ్యర్థి బన్నా వెంకటేశ్‌కు 15..
- యూపీకి చెందిన శక్తి దుబెకు తొలి ర్యాంకు

**దిల్లీ, హైదరాబాద్, అమరావతి:** యూపీఎస్సీ.. మంగళవారం విడుదల చేసిన సివిల్స్2024 తుది ఫలితాల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని నైనికి చెందిన శక్తి దుబె తొలి స్థానంలో నిలిచారు. వరంగల్‌కు చెందిన సాయిశివాని 11వ ర్యాంకు సాధించారు. తెలుగు రాష్ట్రాల్లో ఆమెదే ఉత్తమ ర్యాంకు. ఆ తర్వాత ర్యాంకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన బన్నా వెంకటేశ్‌ది. ఆయన ఇప్పటికే సివిల్ సర్వీసెస్‌లో ఉన్నా... మళ్లీ రాసి 15వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. సివిల్ సర్వీసెస్‌లో 100 లోపు ర్యాంకుల్లో ఐదు సాధించి మరోసారి తెలుగు రాష్ట్రాల అభ్యరులు సత్తా చాటారు. 50 మందికిపైగా తెలుగు అభ్యర్థులు వివిధ కేంద్ర సర్వీసులకు ఎంపికయ్యారు. తెలుగు విజేతల్లో అమ్మాయిలు 10 మందిలోపే ఉండటం గమనార్హం. ఈసారి 1 నుంచి

తరువాయి 2లో



సాయిశివాని | బన్నా వెంకటేశ్ | శక్తి దుబె



## సుంకాలేతర అడ్డంకులను తొలగించండి

- భారత్‌కు జేడీ వాన్స్ పిలుపు

**అమరావతి:** జైపుర్: రెండు దేశాల మధ్య సులభతర వాణిజ్యం కోసం సుంకాలేతర అడ్డంకులను తొలగించాలని, తమ దేశం నుంచి ఇంధన, సైనిక సామగ్రిని కొనుగోలు చేసేందుకు వీలుగా మార్కెట్లను మరింతగా తెరవాలని భారత్‌కు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పిలుపునిచ్చారు. ప్రపంచ సవాళ్లను రెండు దేశాలూ కలిసి ఎదుర్కోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. భారత్, అమెరికాల బలమైన బంధమే 21వ శతాబ్దపు భవిష్యత్తును నిర్వచిస్తుందని నమ్ముతున్నానని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రత్యేక వ్యక్తి అంటూ వాన్స్ ప్రశంసల జల్లు కురిపించారు. రాజస్థాన్

తరువాయి 2లో


## ఇంటర్‌లో 71.37% మంది పాస్

### తొలిసారిగా 70 శాతానికి పైగా నమోదు

- ఫస్టియర్‌లో 66.89% ఉత్తీర్ణత
- ఫలితాల్లో అమ్మాయిలదే హవా
- 80.12 శాతంతో ములుగు జిల్లా అగ్రస్థానం
- మే 22 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

**హైదరాబాద్:** రాష్ట్రంలో ఇంటర్ పరీక్షల్లో 71.37 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. కరోనా ఏడాది(2021) కాకుండా తొలిసారిగా 70 శాతానికి పైగా ఉత్తీర్ణత నమోదైంది. అలాగే ప్రథమ సంవత్సరంలో 66.89 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. 2024తో పోలిస్తే తొలి ఏడాది ఉత్తీర్ణత 5.83 శాతం అధికంగా ఉంది. అబ్బాయిల కంటే అమ్మాయిల ఉత్తీర్ణత 13 నుంచి 14 శాతం అధికంగా ఉండటం గమనార్హం. మంగళవారం ఇంటర్‌బోర్డు కార్యాలయంలో ఉప

తరువాయి 2లో



# పర్యాటకులపై పంజా

పహల్గాం: జమ్మూకశ్మీర్‌లో మరోసారి ఉగ్రవాదులు పేట్రేగిపోయారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేర్కొందిన అనంత్‌నాగ్ జిల్లా పహల్గాం సమీప బైసరన్ లోయలోని పచ్చని మైదానంలో విహరిస్తున్న పర్యాటకులను సాయుధ ముష్కరులు చుట్టుముట్టి కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో చోటుచేసుకుంది. దుండగులు అతి సమీపం నుంచి తుపాకులు ఎక్కుపెట్టి తూటాల వర్షం కురిపించారు. మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుషులే లక్ష్యంగా దాడి చేశారు. 28 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. కాల్పుల శబ్దం విని అప్రమత్తమైన భద్రతా బలగాలు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని ఉగ్రవాదుల కోసం వేట మొదలుపెట్టాయి. ప్రధాని మోదీ సూచన మేరకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మంగళవారం రాత్రి శ్రీనగర్‌కు చేరుకున్నారు. మృతుల్లో ఇద్దరు విదేశీయులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న నిఘా విభాగం అధికారి మనీశ్ రంజన్, కర్ణాటకకు చెందిన వ్యాపారి మంజునాథ్ ప్రాణాలు కోల్పోయారు. పర్వతాల మధ్య ఉండే బైసరన్ ప్రాంతానికి కాలినడక లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉంది. కాల్పుల్లో గాయపడిన వారిలో కొందరిని గుర్రాలపై కిందకు తరలించారు. సహాయక చర్యల కోసం హెలికాప్టర్‌ను రంగంలోకి దించారు.

**ఘాతుకానికి పాల్పడింది ఎవరు?**

కశ్మీర్‌లో కొంతకాలం నుంచి పర్యాటకుల తాకిడి పెరిగిన నేపథ్యంలో ఉగ్రవాదులు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు భద్రతా దళాలు భావిస్తున్నాయి. పాకిస్థాన్ కేంద్రంగా ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తున్న 'లష్కరే తయ్యిబా' అనుబంధ విభాగం 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' ఈ దాడికి తెగబడినట్లు ప్రకటించుకుంది. సైనికుల దుస్తుల్లో వచ్చిన అయిదుగురు ముష్కరులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని తెలుస్తోంది. కాల్పుల అనంతరం సమీప అడవుల్లోకి పారిపోవడంతో భద్రతా సిబ్బంది గాలిస్తున్నారు.

*** అమర్‌నాథ్ యాత్రను అడ్డుకునే కుట్ర**

అమర్‌నాథ్ యాత్రకు పెద్దఎత్తున రిజిస్ట్రేషన్లు జరిగాయన్న సమాచారం నేపథ్యంలో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. 38 రోజులపాటు కొనసాగే అమర్‌నాథ్ యాత్ర జులై 3నుంచి ప్రారంభం కానుంది. దేశం నలుమూలల నుంచి లక్షల మంది యాత్రికులు రెండు మార్గాల్లో అమర్‌నాథ్ హిమలింగం దర్శనానికి వెళ్తుంటారు. ఈ మార్గాల్లో ఒకటి అనంత్‌నాగ్ జిల్లాలో పహల్గాం నుంచి 48 కి.మీ. దూరం ఉండగా, మరొకటి గందర్బల్ జిల్లా బాల్తాల్ నుంచి 14కి.మీ. దూరం ఉంటుంది.

*** నేడు పహల్గాంకు అమిత్ షా**

సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ ఉగ్రదాడిని ఖండించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఫోన్లో మాట్లాడారు. అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఘటనాస్థలాన్ని సందర్శించాలన్న ప్రధాని ఆదేశంతో హోంమంత్రి అమిత్ షా హుటాహుటిన మంగళవారం రాత్రి శ్రీనగర్‌కు చేరుకున్నారు. భద్రతా సంస్థల ఉన్నతాధికారులతో సమావేశమై పరిస్థితులను సమీక్షించారు. ఆయన వెంట జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హా కూడా ఉన్నారు. బుధవారం అమిత్ షా పహల్గాంకు వెళ్లనున్నారు. ఉగ్రవాదుల దుశ్చర్యపై భారత పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ సహా పలువురు నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దాడిని ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించింది.

*** క్షమించరాని ఘటన: రాష్ట్రపతి ముర్ము**

'పర్యాటకులపై కాల్పులు అత్యంత హేయమైన చర్య. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం భయానకం. ఇది క్షమించరానిది. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా'.

*** దృఢసంకల్పంతో ఉగ్రనిర్మూలన: ప్రధాని మోదీ**

'అత్యంత హేయమైన దాడికి పాల్పడిన హంతకులు, వెనుక ఉన్నవారిని చట్టం ముందుకు తీసుకొస్తాం. వారిని వదిలిపెట్టబోం. ఉగ్రమూకల ఎజెండా ఎప్పటికీ విజయవంతం కాదు. ఉగ్రవాదంపై పోరాడాలనే మా సంకల్పం దృఢమైనది. మరింతగా బలపడుతుంది'.

# సుంకాలేతర అడ్డంకులను తొలగించండి

(మొదటి పేజీ తరువాయి)

రాజధాని జైపుర్‌లోని అంతర్జాతీయ కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. 'భారత్, అమెరికా విజయవంతంగా కలిసి పని చేస్తే సుసంపన్న, శాంతియుత 21వ శతాబ్దాన్ని చూడగలం. ఒకవేళ అలా చేయడంలో విఫలమైతే అత్యంత దారుణ శతాబ్దాన్ని చూడాల్సి వస్తుంది. భారత్ తన సహజ వాయువు, కీలక ఖనిజాలైన సహజ వనరులను వినియోగించుకోవడానికి మేం సాయం చేస్తాం. కలిసి ఇంధన ఉత్పత్తి చేయడం అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న అవాంఛనీయ పోటీని నివారిస్తుంది. అయితే అమెరికాతో ఇంధన బంధాన్ని విస్తృతపరుచుకునే విషయంలో భారత్ సుదూరంగా ఉంది. తన మార్కెట్లను అమెరికాకు అందుబాటులోకి తెచ్చేందుకు భారత్.. సుంకాలేతర అడ్డంకులను తొలగించాలి' అని వాన్స్ పేర్కొన్నారు.

భారత వారసత్వ సంపద, సంప్రదాయాలను చూసి తాను అబ్బురపడినట్లు జేడీ వాన్స్ వెల్లడించారు. మంగళవారం తన సతీమణి ఉషా వాన్స్, పిల్లలు ఇవాన్, వివేక్, మీరాబెల్‌లతో కలిసి ఆయన జైపుర్‌లోని చారిత్రక అంబర్ కోటను సందర్శించారు. ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ వారికి స్వాగతం పలికారు. చంద, పుష్ప అనే ఏనుగులతో వారికి ప్రత్యేక ఆహ్వానాన్ని ఏర్పాటు చేశారు.

# పోలవరంబనకచర్ల ప్రాజెక్టుకు సాయం చేయండి

దిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం దిల్లీలో నలుగురు కీలక కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి చెందిన వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు, రాజకీయ అంశాలపై వారితో చర్చించారు. విదేశీ పర్యటన ముగించుకొని మంగళవారం తెల్లవారుజామున దిల్లీ చేరుకున్న చంద్రబాబు ఉదయం నుంచి సాయంత్రం వరకు వరుసగా కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, హోంమంత్రి అమిత్ షాలతో సమావేశమయ్యారు. అమిత్ షాతో భేటీలో రాష్ట్ర పరిపాలన, అభివృద్ధి వ్యవహారాలతో పాటు రాజకీయ అంశాలూ చర్చకు వచ్చినట్లు తెలిసింది. తొలుత ఉదయం 10.30కి జల్‌శక్తి మంత్రి పాటిల్‌తో జరిగిన భేటీలో రాష్ట్రాన్ని కరవు రహితంగా మార్చేందుకు ప్రతిపాదించిన పోలవరం బనకచర్ల ప్రాజెక్టు గురించి చంద్రబాబు వివరించారు. 'కేంద్రం ప్రతిపాదిస్తున్న నదుల అనుసంధాన లక్ష్యాన్ని ఈ ప్రాజెక్టు నెరవేరుస్తుంది. దీని ద్వారా గోదావరికృష్ణాపెన్నా నదీ పరివాహక ప్రాంతాలను అనుసంధానించి రాష్ట్రంలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలను తీర్చవచ్చు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం తన వంతు సాయం చేయాల'ని విజ్ఞప్తిచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కొళాయి నీరు అందించే జల్‌జీవన్ మిషన్ అమలు కాలాన్ని పొడిగించినందుకు పాటిల్‌కు ధన్యవాదాలు తెలిపారు. గత వైకాపా ప్రభుత్వంలో జరిగిన లోపాలను సరిదిద్దడంతో పాటు శాశ్వత ప్రాతిపదికన తాగునీటి వనరులను అనుసంధానించాలని, మిగిలిన గ్రామాలకు కూడా నీరందించేలా ఇప్పుడున్న ధరల ప్రకారం నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో అటల్ భూజల్ యోజన అమలుపైనా చర్చించారు.

**చంద్రబాబు ముందుచూపునకు మేఘ్‌వాల్ కితాబు**

న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్‌ను సీఎం చంద్రబాబు ఆయన నివాసంలో కలిశారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దీనిపై ప్రతిపాదనలు పంపినందున కేంద్ర ప్రభుత్వపరంగా అధికారిక కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా మేఘ్‌వాల్ తన మంత్రిత్వశాఖ అధికారులకు చంద్రబాబును పరిచయం చేస్తూ 'ఆయన అన్నింటిలోనూ 25 ఏళ్ల ముందుచూపుతో ఆలోచిస్తారు. ఈనాటి ఆధునిక హైదరాబాద్ ఆయన ఆలోచనా రూపమే'నని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా అర్జున్‌రామ్ దంపతులు చంద్రబాబుకు వినాయకుడి ప్రతిమను బహూకరించారు.

**ఆక్వా రంగాన్ని ఆదుకోండి**

అనంతరం ఇక్కడి వాణిజ్య మంత్రిత్వ శాఖ కార్యాలయం వాణిజ్య భవన్‌లో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో చంద్రబాబు సమావేశమయ్యారు. అమెరికా టారిఫ్ యుద్ధం ప్రకటించాక ఆక్వా రంగంలో నెలకొన్న అనిశ్చితిని వివరించారు. భారత్ నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 26% సుంకాలు విధించడం ఏపీలో మత్స్య రంగానికి తీరని నష్టం చేకూర్చేలా ఉన్నందున కేంద్రం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకోసం స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక చర్యలను ప్రతిపాదించారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధిపైనా చర్చించారు. వీటికి బడ్జెట్‌లో కేటాయించిన నిధులను వినియోగించి త్వరగా మౌలిక వసతుల కల్పనకు ఉపక్రమించాలని కోరారు. ప్రకాశం జిల్లాలో ఉప్పు భూములను రాష్ట్రానికి అప్పగించే అంశం వారి మధ్య చర్చకు వచ్చింది.

# ఇంటర్‌లో 71.37%మంది పాస్



(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఫలితాలను విడుదల చేశారు. మొత్తంగా ఇంటర్ ఫలితాల్లో ములుగు జిల్లా(80.12%) అగ్రస్థానంలో, కామారెడ్డి జిల్లా(54.83%) చివరిస్థానంలో నిలిచాయి. మొదటి ఏడాదిలో మేడ్చల్ జిల్లా (77.59%) మొదటిస్థానం, మెదక్ జిల్లా(46.87%) ఆఖరుస్థానం దక్కించుకున్నాయి. ఇంటర్ జనరల్‌తోపాటు ఒకేషనల్ కోర్సు ఫలితాలను కూడా కలుపుకొంటే మాత్రం మొత్తం ఉత్తీర్ణత 65.65 శాతమే అవుతోంది.

*** భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలి**

ఫలితాల వెల్లడి సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉత్తీర్ణులైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్య వైపు అడుగులు వేసి భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటనకు వెళ్లడంతో ఆయన తరఫున అభినందనలు చెప్పేందుకు తాను వచ్చానన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని పేర్కొన్నారు.

*** నేటినుంచి సప్లిమెంటరీకి దరఖాస్తులు**

ఇంటర్ తప్పిన వారి కోసం మే 22 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. ఈ నెల 23 నుంచి 30 వరకు ఆ పరీక్షలతోపాటు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సప్లిమెంటరీలో పాసైతే రెగ్యులర్‌గా పాసైనట్లే పరిగణిస్తారని, ఒకసారి తప్పిన వారి జాబితాలో ఉండరని చెప్పారు. కార్యక్రమంలో సీజీజీ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర నిమ్జే, పరీక్షల కంట్రోలర్ జయప్రద బాయి, సంయుక్త కార్యదర్శులు మోహన్, జ్యోత్స్నారాణి, భీమ్‌సింగ్ పాల్గొన్నారు.

*** ఫలితాల ముఖ్యాంశాలు ఇవీ..**

రెగ్యులర్, ప్రైవేట్ (ఒకసారి తప్పినవారు), ఒకేషనల్‌తో కలిపి 3,33,908 మంది ఇంటర్‌లో పాసయ్యారు. వారిలో 2.12 లక్షల మంది ఏ గ్రేడ్ (75%, ఆపై మార్కులు) సాధించారు. తొలి ఏడాదిలో 3.22 లక్షల మంది ఉత్తీర్ణులు కాగా వారిలో 2.07 లక్షల మందికి ఏ గ్రేడ్ వచ్చింది.

*** ఫస్టియర్‌లో నలుగురు, సెకండ్ ఇయర్‌లో ఆరుగురి ఫలితాలను విత్ హెల్డ్‌లో ఉంచారు.**

అతితక్కువగా హెచ్‌ఈసీలో 46.26 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అత్యధికంగా ఎంపీసీలో 72.23 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

# జపాన్ పెట్టుబడులు.. రూ.12,062 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలో జపాన్‌లో పర్యటించిన తెలంగాణ రైజింగ్ బృందం పలు కీలక ఒప్పందాలు చేసుకుంది. ఏడు రోజుల పర్యటనలో రూ.12,062 కోట్ల పెట్టుబడులు సాధించింది. వీటి ద్వారా తెలంగాణలో యువతకు దాదాపు 30,500 ఉద్యోగావకాశాలు లభించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. జపాన్‌కు చెందిన మారుబెని కంపెనీ.. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. రూ.1,000 కోట్లు ప్రారంభ పెట్టుబడి పెట్టనుంది. మొత్తంగా రూ.5,000 కోట్ల పెట్టుబడులకు అంచనా వేసింది. ఎన్‌టీటీ డేటా, నెయిసా సంస్థలతోనూ తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థలు రూ.10,500 కోట్ల పెట్టుబడులతో హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నాయి. తోషిబా ట్రాన్స్‌మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా (టీటీడీఐ)తోనూ ఒప్పందం చేసుకోగా.. ఆ సంస్థ రూ.562 కోట్లతో రుద్రారంలో విద్యుత్ పరికరాలు, సామగ్రి తయారీ ఫ్యాక్టరీని నెలకొల్పనుంది. వీటి ద్వారా 30 వేల ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయి. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'టామ్ కామ్'తో టెర్న్, రాజ్ గ్రూప్‌లు చేసుకున్న ఒప్పందాల ఫలితంగా.. తెలంగాణకు చెందిన 500 మందికి జపాన్‌లో ఉద్యోగ నియామకాలకు మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం ఈ నెల 15న రాత్రి హైదరాబాద్ నుంచి బెంగళూరు మీదుగా జపాన్ పర్యటనకు వెళ్లింది. 16న టోక్యో చేరుకుని.. 22 వరకూ పర్యటించింది. ఏడు రోజుల పర్యటనలో జపాన్ పారిశ్రామికవేత్తలతో సమావేశమై తెలంగాణలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించింది. మురసాకి రివర్ మ్యూజియాన్ని, ఒసాకా రివర్ ఫ్రంట్‌ను సందర్శించింది. మంగళవారం హిరోషిమా ఉపగవర్నర్‌తో భేటీ అయి రాష్ట్రంలో పెట్టుబడులపై చర్చించింది. ముఖ్యమంత్రి బృందం బుధవారం హైదరాబాద్‌కు చేరుకోనుంది. ఈ పర్యటనలో సీఎం వెంట ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ కె.రఘువీర్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎం ముఖ్యకార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, టీజీఐఐసీ సీఈఓ మధుసూదన్, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తదితరులున్నారు.

# సివిల్స్ తొలి 100 ర్యాంకర్లలో ఐదుగురు మనవాళ్లు

(మొదటి పేజీ తరువాయి)

200 లోపు ర్యాంకు సాధించిన వారిలో పలువురు గతంలోనూ సివిల్స్‌కు ఎంపికైన వారే. అయితే ఐఏఎస్, ఐపీఎస్ తదితర సర్వీస్‌ల కోసం మరో ప్రయత్నం చేసి పలువురు తమ లక్ష్యాన్ని సాధించుకున్నారు. హరియాణాలో పుట్టి వడోదరలో పెరిగిన హర్షిత గోయల్ రెండో ర్యాంకు, మహారాష్ట్రలోని పుణెకు చెందిన డోంగ్రె అర్చిత్ పరాగ్ మూడో ర్యాంకు సాధించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన షా మార్గి చిరాగ్ నాలుగో ర్యాంకు, దిల్లీకి చెందిన అకాశ్ గర్గ్ ఐదో ర్యాంకు సొంతం చేసుకున్నారు. ఐదుగురు టాపర్లలో ముగ్గురు (1, 2, 4 ర్యాంకులు) మహిళలే కావడం విశేషం. మొత్తంగా దేశంలోని అత్యున్నత సర్వీసులకు 1,009 మంది ఎంపికయ్యారు. వీరిలో 725 మంది పురుషులు, 284 మంది మహిళలు ఉన్నారు. 25 మంది టాపర్లలో 11 మంది మహిళలు, 14 మంది పురుషులు ఉన్నారు కేంద్ర సర్వీసులకు ఎంపికైన వారిలో 335 మంది జనరల్ కేటగిరీకి చెందినవారు. 109 మంది ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, 318 మంది ఓబీసీ వర్గాలకు, 160 మంది ఎస్సీ వర్గాలకు, 87 మంది ఎస్టీ వర్గాలకు చెందినవారు. అన్ని వర్గాల నుంచి 45 మంది దివ్యాంగులు ఎంపికయ్యారు.

# ఉక్రెయిన్‌తో ద్వైపాక్షిక చర్చలకు సిద్ధం

మాస్కో: ఉక్రెయిన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. రెండు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా ఆయన ఇలాంటి ప్రతిపాదన చేయడం గమనార్హం. శాంతిని నెలకొల్పేందుకు అమెరికా తీవ్రంగా ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో పుతిన్.. రష్యా దేశ అధికారిక వార్తా ఛానల్‌లో ఈ మేరకు చెప్పారు. ఈ వ్యాఖ్యలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పరోక్షంగా స్పందించారు. పౌరులపై దాడులు ఆపేలా కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఎలాంటి చర్చలకైనా సిద్ధమని చెప్పారు.

**లండన్‌లో చర్చలు..**

యుద్ధానికి ముగింపు పలికేందుకు ఉక్రెయిన్, బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా అధికారులు బుధవారం లండన్‌లో చర్చలు జరపనున్నారు. ఈ వ్యవహారంలో ట్రంప్ సర్కారు జోక్యాన్ని కొనసాగించాలా వద్దా అన్నది నిర్ణయించడంలో ఈ భేటీ కీలకం కానుందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో స్పష్టంచేశారు. ఒకవైపు శాంతి చర్చలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ మరోవైపు రష్యా ఉక్రెయిన్‌లు మాత్రం దాడులను చేసుకుంటూనే ఉన్నాయి. ఈస్టర్ సందర్భంగా తాత్కాలిక కాల్పుల విరమణ పాటిస్తామని ప్రకటించిన రష్యా, దానిని అమలు చేయలేదు. తాజాగా ఉక్రెయిన్‌లోని ఒడెసా, జపోరిజియా నగరాలపై డ్రోన్లు, గ్లైడ్ బాంబులతో విరుచుకుపడింది. ఇందులో ఒక వృద్ధురాలు ప్రాణాలు కోల్పోగా.. నలుగురు చిన్నారులు సహా 27 మంది గాయపడ్డారు. యుద్ధం ముగించేందుకు జరిపే శాంతి చర్చలు తక్షణ ఫలితాలను ఇచ్చే అవకాశం లేదని రష్యా అధ్యక్ష భవనం 'క్రెమ్లిన్' అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ ప్రకటించారు. పౌర వసతులపై దాడులను ఆపాలన్న జెలెన్‌స్కీ ప్రతిపాదనపై చర్చలకు ప్రణాళికేదీ తమ వద్ద లేదన్నారు.

**వారంలో యుద్ధం ఆగిపోతుంది: ట్రంప్**

మరోవైపు ఉక్రెయిన్, రష్యాల మధ్య ఈ వారంలో శాంతి ఒప్పందం కుదిరి, యుద్ధం ఆగే అవకాశాలున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఈ మేరకు తన సామాజిక మాధ్యమం 'ట్రూత్'లో పోస్టు చేశారు.

# ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపు

హైదరాబాద్: ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులైన ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి చట్టం అమలుపై కలెక్టర్లు మరింత శ్రద్ధ పెట్టాలని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ ఆలోచనలు, ప్రాథమ్యాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. సచివాలయం నుంచి సీఎస్ శాంతి కుమారితో కలిసి మంత్రి పొంగులేటి మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలకు అవసరమైన, చిరస్మరణీయమైన భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని.. దాని అమలు బాధ్యత కలెక్టర్లపై ఉందని స్పష్టంచేశారు.

*** 28 జిల్లాల్లోని పైలట్ మండలాల్లో కార్యశాలలు**

పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మండలాల్లో ఈ నెల 30వ తేదీ నాటికి భూభారతి చట్టంపై రెవెన్యూ సదస్సులు పూర్తవుతాయని, ప్రస్తుతం రాష్ట్రంలో 159 మండలాల్లో అవగాహన సదస్సులు పూర్తయ్యాయని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. 'సీసీఎల్ఏ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను కూడా పైలట్ మండలాల్లోని రెవెన్యూ సదస్సుల్లో చేర్చాలని అధికారులకు సూచించాం. ఈ మేరకు ప్రస్తుతం 5,905 దరఖాస్తులు వచ్చాయి. వచ్చే నెలలో హైదరాబాద్ సహా 28 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేస్తాం. ప్రస్తుతం జరుగుతున్న సదస్సుల ద్వారా వచ్చిన విజ్ఞప్తులు, అనుభవంలోకి వచ్చిన అంశాల ఆధారంగా తహసీల్దార్ల నేతృత్వంలోని బృందాలు ఆయా మండలాల్లో కార్యశాల(వర్క్‌షాప్)లు నిర్వహించాలి' అని పొంగులేటి మార్గదర్శనం చేశారు.

*** నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ**

ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను ప్రతి సోమవారం వారి ఖాతాలలో నేరుగా జమ చేస్తామని మంత్రి తెలిపారు. '400 చ.అడుగులకు తగ్గకుండా, 600 చ.అడుగులకు మించకుండా నిర్మాణం జరిగితేనే అధికారులు బిల్లులు మంజూరు చేయాలి. వానాకాలం నేపథ్యంలో మే నెల మొదటి వారంలోగా నియోజకవర్గానికి 3,500 మంది చొప్పున లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి. 200 దరఖాస్తులకు ఒక గెజిటెడ్ అధికారిని నియమించి, అర్హులకు ఇళ్లు మంజూరయ్యేలా చూడాలి. అనర్హులకు చోటు కల్పిస్తే ఆ అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుంది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకు సిమెంటు అందజేసేందుకు ప్రయత్నిస్తున్నాం. పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి త్వరలో సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలతో చర్చిస్తాం' అని మంత్రి పేర్కొన్నారు.

# రాజీవ్ యువ వికాసం అర్హుల జాబితా రూపొందించాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్..**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితా రూపొందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో రాజీవ్ వికాసం దరఖాస్తుల పరిశీలన మార్గదర్శకాలపై సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకు మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జాబితా రూపొందించే




విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో ఎంపీడీవోలు, బ్యాంకు మేనేజర్లు కమిటీ సభ్యులు తమ మండలాల్లోని కార్యాచరణ రూపొందించుకొని ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారి జాబితా రూపొందించాలన్నారు. అనంతరం జిల్లా స్థాయి కమిటీకి జాబితాలో అందించాలని ఆదేశించారు. బ్యాంకర్లు సమన్వయంతో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, పట్టాదారు పుస్తకం, సదరం సర్టిఫికెట్ , ఇతర దృవీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. జనాభా ప్రాతిపదిక కలిగిన యూనిట్ల కేటాయింపు ఉంటుందని, ఒకే గ్రామంలో ఒక యూనిట్కు ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకుంటే వాటిని పరిశీలించాలని, ఆయా కార్పొరేషన్ల అధికారులు దరఖాస్తుల పరిశీలన ప్రక్రియలో పాల్గొనాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ సంబంధిత యూనిట్ల స్థాపనకు ప్రజలకు అవగాహన కల్పించాలని, చేపల పెంపకం యూనిట్లను ఈ పథకం ద్వారా స్థాపించడం ద్వారా వారి యొక్క ఆర్థిక పురోగతి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా పాడి పరిశ్రమలు స్థాపనకు ప్రోత్సహించాలని ఆయన సూచించారు. యువ వికాసం అమలకు బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో సిపిఓ సంజీవరావు, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, మహిళా శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు , బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.



## క్యాన్సర్ బాధితురాలికి జగ్గారెడ్డికి అండ

**10లక్షలు వైద్యానికి అందజేత**

సంగారెడ్డి,ప్రజాస్ఫూర్తి 22: కష్టాల్లో ఉన్న కుటుంబాలకు నేనున్నానంటూ మనోధైర్యం కోల్పోకుండా వారికి అండగా నిలిచే మనసున్న నాయకుడు సంగారెడ్డి జగ్గారెడ్డి.క్యాన్సర్ బాధితురాలికి.. 10లక్షల నగదు సాయం అందించిన జగ్గారెడ్డి. సదాశివపేటకు చెందిన ఆమని అనే మహిళ ఇంటికి వెళ్లి పరామర్శించారు.చికిత్స కోసం ఇప్పటి వరకు 7లక్షల అప్పులు చేశానని తెలిపారు.భర్త చనిపోయాడని, ఇద్దరు ఆడపిల్లలతో దయనీయ జీవితం గడుపుతున్నానని జగ్గారెడ్డికి తెలిపారు బాధితురాలు ఆమని. ఈ నరకం భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నానని, పిల్లల కోసం బతుకుతున్నానని జగ్గారెడ్డికి చెప్పింది ఆమని.తక్షణమే స్పందించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి 10 లక్షల రూపాయలను అందించారు.సీఎం రేవంత్ రెడ్డి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించాలని తీసుకున్న నిర్ణయం మంచిదని జగ్గారెడ్డి అన్నారు.తనకు సాయం చేసి, వీడియోలు, ఫోటోలు తీయించుకునే అలవాటు లేదన్నారు. కానీ ఈ సమస్య పది మంది దృష్టికి రావాలని మీడియా దృష్టి కి తీసుకు వచ్చానన్నారు.పేదలకు ఇలాంటి రోగాలు వస్తే.. కనీసం చికిత్స చేయించుకోవడానికి.. పైసలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఇలాంటి నిరుపేద క్యాన్సర్ బాధితులకు అండగా నిలిచేందుకు దాతలందరూ ముందుకు రావాలి.క్యాన్సర్ బాధితులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులు,ట్రీట్ మెంట్ కోసం నిరుపేద క్యాన్సర్ బాధితులు పడుతున్న సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళతానని తెలిపారు.

## బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

*** బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జి. నర్సింహారెడ్డి**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని వివేకానంద నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు జి. నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఓ సమావేశంలో నరసింహారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అంగరంగవైభవంగా రజతోత్సవ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేసీఆర్ను చూడాలని, ఆయన మాట వినాలను ఈ నెల 27 కోసం ప్రజలంతా ఎదురు చూస్తున్నారని ఆయన అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని నంబర్ వన్గా తీర్చిదిద్దితే.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో దిగజార్చిందని విమర్శించారు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ నుంచి రజతోత్సవ సభకు ప్రజలు కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

## బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గా ధీరావత్ తావుర్య నాయక్



యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేర్ నియోజకవర్గానికి చెందిన ధీరావత్ తావుర్య నాయక్ బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమిస్తున్నట్లు గా బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు డా.కళ్యాణ్ నాయక్ తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యాలయం నుండి బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేనావత్ రవి నాయక్ పత్రిక ప్రకటన చేసారు. రాష్ట్ర కార్యదర్శి గా నియమితులైన ధీరావత్ తవుర్య నాయక్ ని పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేడు ఇల్లందు లో ప్రకృతి – ఆరోగ్య మహాసభలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఈ నెల 23 న ఇల్లందులో జరుగనున్న ప్రకృతి ఆరోగ్య మహాసభలను జయప్రదం చేయాలని కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమం కోఆర్డినేటర్ జి. సుగుణా రావు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.ఇల్లందులోని ఐతా ఫంక్షన్ హాల్ లో జరుగనున్నట్లు వెల్లడించారు. ప్రకృతి ఆశ్రమం వ్యవస్థాపకులు, ప్రకృతి కవి, కాళోజి అవార్డు గ్రహీత జయరాజు ప్రధాన వక్తగా, ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమానికి అనుబంధంగా ఉన్న సిద్ధార్థ ఆరోగ్య కేంద్రం ఇల్లందు నిర్వాహకులు, ఆక్యుపంచర్ తెరపిస్ట్ హెచ్. ఆర్. లింగాల వెంకన్న అధ్యక్షతన జరుగనున్న ఈ ప్రకృతి ఆరోగ్య మహాసభలలో విశిష్ట, ఆత్మీయ అతిథులుగా ఇల్లందు డిఎస్పి చంద్రభాను, ప్రముఖ ఆకుపంచర్ తెరపిస్ట్ అనిల్ కుమార్ తెంబరేణి, ప్రముఖ అనువంశిక వైద్యులు సింహాచలం లక్ష్మణస్వామి,పర్యావరణ వేత్త మొక్కల వెంకటయ్య, ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు, మన్ కీ బాత్ మొక్కల రాజశేఖర్, నవభూమి దినపత్రిక స్టేట్ బ్యూరో తుమ్మలపల్లి ప్రసాద్, స్థానిక సీఐ .బి. సత్యనారాయణ, స్థానిక వైద్యులు టి సుధాకర్, డి. రవికుమార్ లు పాల్గొని ప్రసంగించనుండగా, ప్రకృతి ప్రేమికులు దాట్ల వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఔషధ మొక్కల ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ సభలలో ప్రకృతి వైద్యులు, ఆరోగ్య దీక్షకులు, యోగా మాస్టర్స్ టి. వెంకన్న, పిసివి స్వామి, వరలక్ష్మి లతోపాటు కవులు, గాయకులు, సామాజికవేత్తలు, ప్రకృతి ప్రేమికులు, పర్యావరణ రక్షకులు, ఆల్టర్నేటివ్ తెరపిస్టులు పాల్గొని అవగాహనను కల్పిస్తారన్నారు. అనంతరం ఉచితంగా వైద్య సేవలను అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఇల్లందు పరిసర ప్రాంతాల ప్రజలు, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఇంటర్ ఫలితాల్లో ఎస్ ఆర్ ప్రభంజనం...





ప్రజాస్ఫూర్తి ,నల్లగొండ : తెలంగాణ ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో నల్లగొండ ఎస్ఆర్ బ్రాంచ్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ కనబర్చారు. సెకండియర్ ఎంపీసీ విభాగంలో టి. సాత్వికకు 992, ఎస్. నేహా 992, ఎం. స్ఫూర్తి 992, ఆశ శ్రీ 991, సాయి శిరీష 990, ఆర్. పూజిత 990, ఎం. భావన 990 మార్కులు సాధించారు. అదే విధంగా సీనియర్ బైపీసి విభాగంలో నీఖత్ తబస్సుమ్ కు 989, బి. పూజిత కు 988 మార్కులు పొందారు. జూనియర్ ఎంపీసి విభాగంలో పి. సాయి ప్రతాప్ 467, వై. జ్ఞానేశ్వర్ 466, కే. చందన 465, కే. రమ్య 465, జూనియర్ బైపిసి విభాగంలో ఎ. హారిక 433, ఎన్. సాయి కిరణ్ 432 మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నారు. ఈ సందర్భంగా నల్లగొండ బ్రాంచ్ జోనల్ ఇంచార్జి దోనాల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సీనియర్ అధ్యాపకుల బోధన, క్రమశిక్షణ వల్లే ఉత్తమ ఫలితాలు సాధ్యం అయ్యాయని తెలిపారు. విద్యార్థులను ఎస్ ఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి, సీఈఓ సురేందర్ రెడ్డి, నల్లగొండ ప్రిన్సిపాల్లు సతీష్ రెడ్డి, కమలాకర్, శ్రీనివాస్ రావు, అధ్యాపకులు అభినందించారు.

## కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుకు ముగిసిన తుది అంకం

*** గెజిట్ జారీ చేసిన రాష్ట్ర గవర్నర్**

*** ఎమ్మెల్యే కూనంనేని అభినందనల వెల్లువ**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం నియోజకవర్గ పరిధి లోని కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలు, సుజాతనగర్ మండల పరిధిలోని కోమటిపల్లి, నిమ్మలగూడెం, మంగపేట, నాయకులగూడెం, సుజాతనగర్, నర్సింహసాగర్, లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీలను కలుపుతూ కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన కృషి తుది అంకానికి చేరింది. ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఆమోద తీర్మానం చేసిన చేసింది. ఈ తీర్మానంపై రాష్ట్ర గవర్నర్ మంగళవారం గెజిట్ జారీచేశారు. గెజిట్ జారీతో దాదాపు కార్పొరేషన్ ఏర్పాటు ప్రక్రియ పూర్తయినట్లే, త్వరలో ప్రభుత్వం నుంచి జివో జారీ కానుంది. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుపై గెజిట్ జారీ కావడంతో కొత్తగూడెం నియోజకవర్గ ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోంది. కార్పొరేషన్ ఏర్పాటుపై పట్టుబట్టి సాధించిన శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావుకు ప్రజల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్కకు, జిల్లా ఇంచార్జి మంత్రి కోమటి రెడ్డికి, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావుకు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కు, ఇతర అధికారులకు కూనంనేని ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటుకు యెనలేని కృషి చేసిన కూనంనేని సాంబశివరావు కు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అభినందనలు తెలిపారు.

## బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

*** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : ఈనెల 27న వరంగల్ లో నిర్వహించే బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆధ్వర్యంలో రూపొందించిన “ఛలో వరంగల్” బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకల వాల్ పోస్టర్ ను మంగళవారం నగరంలోని నంది హిల్స్ లోని కేటీఆర్ నివాస కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఛలో వరంగల్” బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుక వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ లో నిర్వహించే బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు కుత్బుల్లాపూర్ నుంచి భారీ సంఖ్యలో బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో




## పుట్టగూడెం తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



రాజపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండలం రేణికుంట పి. ఎ. సి. ఎస్. ఆధ్వర్యంలో పుట్టగూడెం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం మంగళవారం ప్రారంభించారు. పిఎసిఎస్ చైర్మన్ చింతలపురి భాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ కాకల్ల ఉపేందర్, ఎ. ఎం. సి డైరెక్టర్లు సిలివేరు బాలరాజు, మాడోతూ విఠల్ నాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బండి శ్రీనివాస్, నేమిల మహేందర్ గౌడ్, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగె పెంటయ్య గౌడ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రాంజీ నాయక్, మాడోతూ రాములు నాయక్, మాడోతూ లక్ష్మణ్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

## రైతులకు ఎలాంటి విద్యుత్ సమస్యలు ఎదురవ్వకుండా చర్యలు

**- సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రైతులకు ఎలాంటి విద్యుత్ సమస్యలు ఎదురవ్వకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండలంలోని మొర్రాయిపల్లె గ్రామంలో విద్యుత్ శాఖ రైతు పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం అవగాహన కల్పించారు. రైతులకు ఎవరికైనా ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఎదురైతే వెంటనే సంప్రదించాలని, సమస్యపై వెంటనే స్పందించి తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతులు కూడా విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఇ విష్ణు తేజ, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి

*** మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉషారాణి**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: చిన్న పిల్లలకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలని చుంచుపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉషారాణి అన్నారు. ఆయుష్ శాఖ ప్రవేశపెట్టిన పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా చుంచుపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో కూలీలైన్ అంగన్వాడి కేంద్రంలో డాక్టర్ పిల్లలను పరీక్షించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. రామవరం అంగనవాడి సెంటర్లో అంగన్వాడి సూపర్వైజర్ సమక్షంలో అక్కడ తల్లి, పిల్లలకు యోగా ప్రాముఖ్యతను ఆయుష్ డిపార్ట్మెంట్ యోగా ఇన్స్ట్రక్టర్ కమలారాణి వివరించడం జరిగినది . ఈ కార్యక్రమంలో అంగనవాడి టీచర్స్, అంగన్వాడి సూపర్వైజర్, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల చుచుపల్లి వైద్యాధికారిని డాక్టర్ ఉషారాణి. ఫార్మాసిస్ట్ కే రామకృష్ణ యోగ ఇన్స్ట్రక్టర్స్ రమేష్ బాబు, కే కమలా రాణి, చిన్న పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఏళ్ల సమస్యలకు భూభారతితో పరిష్కారం

- చౌటుప్పల్ లో భూభారతి చట్టం-2025 పై అవగాహన
- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి : భూభారతి చట్టంతో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని భూ సమస్యలకు పరిష్కారం లభించనున్నదని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో భూభారతి చట్టం 2025 పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం, జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ భూమి విలువలు పెరిగిపోవడం వల్ల ప్రస్తుతం మనుషుల విలువ తగ్గి భూ తగాదాలు పెరుగుతున్నాయన్నారు. భూభారతి చట్టం వల్ల ఇకపై భూ సమస్యలు ఉండవని, అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం ను ప్రవేశపెట్టి ఆరో ఓ ఆర్ చట్టం తో సమస్యలకు చెక్ పెట్టనున్నదన్నారు. ధరణిలో పరిష్కారం కానీ సమస్య లన్నీ భూభారతిలో అప్పీలు వ్యవస్థ ఉన్నందున పరిష్కారం అవు తాయన్నారు. భూ రక్షణ కొరకు ఇకపై సర్వే నెంబర్ తో పాటుగా హద్దులతో మ్యాప్ ను రూపొందించి పాస్ బుక్ లో ఉంచుతామన్నారు. కబ్జాలు, ఆక్రమణలు జరగవని, భూమికి మరింత భద్రత లభించనున్నదని, రాష్ట్రవ్యాప్తంగా సర్వేయర్ల సంఖ్యను కూడా పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

*** పోడు భూముల సమస్యలను భూభారతితో పరిష్కరించాలి : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం ప్రాంతంలోని గిరిజనుల పోడు భూముల సమస్యలను కూడా భూభారతి చట్టంతో పరిష్కరించాలని తెలంగాణ శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం అధికారులకు సూచించారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం నుంచి భూమి కోసం తెలంగాణలో ఎన్నో ఉద్యమాలు నిర్వహించారు, కానీ నేటికీ భూ సమస్యలు తీరలేదన్నారు. ధరణి చట్టంలో అనుభవదారుకాలం తీసివేయడంతో గతంలో అమ్ముకున్నా రైతుల పేరుపై తిరిగి భూమి రావడంతో వారు ఇతరులకు అమ్ముకొని గ్రామాలలో భూ సమస్యలను సృష్టించారని, భూభారతి చట్టంలో తిరిగి అనుభవదారు కాలాన్ని ప్రవేశపెట్టడం శుభపరిణామమన్నారు. గతంలో ధరణిలో ఒక సర్వే నెంబర్ లోని కొంత భూమిలో సమస్యలు ఉంటే ఆ సర్వే నెంబర్ లోని పూర్తి విస్తీర్ణాన్ని బ్లాక్ చేయడం జరిగిందని, దీంతో సామాన్య రైతులు తమ అవసరాలకు భూమిని అమ్ముకోకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. ఇలాంటి సమస్యలు భూభారతిలో పునరావృత్తం కాకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. రైతుల సమస్యలను పరిష్కరించే విధంగా భూభారతి చట్టం పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని తీసివేస్తామని చెప్పి ఇచ్చిన హామీ ప్రకారం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. అప్పీల్ వ్యవస్థ లేకుండా ధరణి నిరంకుశ చట్టంగా మార్చారని, భూభారతిలో అప్పీ ల్ వ్యవస్థ రావడం రైతులు సంతోషించదగ్గ విషయం అన్నారు. రాష్ట్రంలో సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉందని వెంటనే సర్వేయర్లను నియమించి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

*** రైతులకు మేలు చేయడం కోసమే భూభారతి చట్టం-2025**
*** అదనపు కలెక్టర్ వీరారెడ్డి**

రైతులకు భూ సమస్యలు పరిష్కరించి అన్ని రకాలుగా మేలు చేయడం కోసమే భూభారతి చట్టం 2025 రూపొందించినట్లు యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. భూభారతి చట్టం అమలుపై ముందుగా పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈనెల 14వ తేదీన నాలుగు జిల్లాలలో ఒక్కొక్క మండలాన్ని ఎంపిక చేసిందన్నారు. మే 1వ తేదీ నుండి అన్ని నియోజకవర్గంలో ఒక్కొక్క మండలాన్ని ఎంపిక చేసుకుని భూభారతి చట్టం ను అమలు చేయడం జరుగుతుందని, జూన్ 1వ తేదీ నుండి తెలంగాణ వ్యాప్తంగా పూర్తిస్థాయిలో భూభారతి చట్టంను అమలు చేయడం జరుగుతుందని అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు.

*** భూ భారత్ తో ప్రభుత్వ భూమి పదిలం పబ్బు రాజు గౌడ్**

చౌటుప్పల్ మున్సిపాలిటీలో భూ ఆక్రమణదారుల సంఖ్య పెరిగిపోయిందని, ప్రభుత్వ భూములను ఎక్కడికక్కడ కొల్లగొడుతూ బడా నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తూ అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని, ప్రభుత్వం భూమిని అమ్మి, పట్టా భూమి సర్వే నెంబర్ వేసి పట్టాలు చేస్తూ కోట్లు గడిస్తున్న దానిపై రెవెన్యూ ఉన్నతాధికారులు వెంటనే దృష్టి సారించి ప్రభుత్వ భూమిని కాపాడాలని మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పబ్బు రాజు గౌడ్ కోరారు. భూభారతి అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. గతంలో ప్రభుత్వ భూమి ఆక్రమణదారులను గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేయడంతో కొంతమంది జైలుకు కూడా వెళ్లి వచ్చారన్నారు. మిగతా వారి వివరాలను కూడా అధికారులకు అందజేస్తామని, వాటిపై వెంటనే చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని వారు కోరారు. ఈ సదస్సులో చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, ఆర్డీవో శేఖర్ రెడ్డి, తహసిల్దార్ హరికృష్ణ, మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు, మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహ్మారెడ్డి, మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, ఆర్ ఐ లు బాణాల రాంరెడ్డి, కొప్పుల సుధాకర్ రావు, సిపిఐ నాయకులు పల్లె శేఖర్ రెడ్డి, పగిళ్ల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయ దేవేందర్, సుర్వి నరసింహ, బక్క శ్రీనాథ్, మొగుదాల రమేష్ గౌడ్, కొయ్యడ సైదులు, పాక చిరంజీవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ లో జరిగే పార్టీ ఆవిర్భావ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలి

*** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : వరంగల్ లో జరిగే పార్టీ ఆవిర్భావ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళ వారం ఏ ఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైఫల్యాలు ప్రజా వ్యతిరేకత వరంగల్ సభ వేదికగా ఎండగట్టాలి అని ఆయన అన్నారు. 27 న పార్టీ ఆవిర్భావ రజతోత్సవ వేడుకల సందర్భంగా ఉప్పల్ వ్యాప్తంగా గులాబీ జెండా ఎగరేయాలి అని ఆయన కోరారు. రేవంత్ రెడ్డి పాలన పెయిల్ అయింది.. హైడ్రా పేరుతొ పేద ప్రజల జీవితాలు నాశనం చేసిండు, భూముల అమ్మకాల పేరుతో మూగ జీవాల గోస పోసుకున్నాడు. మూగ జీవాలు రేవంత్ రెడ్డిని క్షమించవు అని ఆయన అన్నారు. రుణమాఫీ చేస్తా అని సగం రుణమాఫీ చేసి చేతులు ఎత్తేసిండు అని ఆయన తెలిపారు. వానకాలం రైతుబంధు ఎగొట్టిన డబ్బులు 13 వేల కోట్లు.. రుణమాఫీ చేసింది 14 వేల కోట్లు అంటే రైతుబంధు ఎగొట్టి రుణ మాఫీ సగం చేసిండు అని ఆయన అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున రావాలి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు , మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ అధ్యక్షులు బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో రారెత్తిస్తున్న ఎండలు




హైదరాబాద్: తెలంగాణలో ఎండల తీవ్రత పెరిగింది. రాగల నాలుగు రోజుల పాటు ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఉత్తర తెలంగాణ జిల్లాలో గరిష్ఠంగా 44 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. మిగతా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. వడగాల్పుల తీవ్రత కారణంగా మధ్యాహ్నం వేళ ప్రజలు బయటకు రావొద్దని సూచించింది. మంగళవారం నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లో అత్యధికంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

## ఘనంగా శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్ల కళ్యాణోత్సవం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాప్రా లో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ నూతన ధర్మకర్తల పర్యవేక్షణ లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం స్వామీ వారికీ సుప్రభాత సేవ, వేదపారాయణం, శ్రీ లక్ష్మీ సుదర్శన హోవనం అనంతరం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్ల కళ్యానోత్సవం ప్రజలు, భక్తుల సమక్షంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ నూతన ధర్మకర్తలు, ఈవో కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదవితరణ నిర్వహించారు. ఈ వేడుకలో కాప్రా మండల తహసీల్దార్ పి సుచరిత, కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్ పాల్ రెడ్డి, కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొబ్బనూరి నాగశేషు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, ఏ ఎస్ రావ్ నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్, సెక్రటరీ శ్రీ శ్రీకాంత్ రెడ్డి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంనూతన ధర్మకర్తల మండలి సభ్యులు పడమటి మల్లారెడ్డి , పి బాబురావు , జి సత్యనారాయణ, నరేందర్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, పి వినోద్ కుమార్ ఆలయ క్లర్క్ శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పవన్ కుమార్, టి శ్రీ హరి, నాగరాజు, శివకుమార్, ప్రదీప్, అలీ, ముస్తఫా, ఎన్ ఎస్ యు ఐ నాయకులు ఆకుల సంతోష్, మనోజ్, అజీజ్, కాప్రా డివిజన్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జి అరుణ్ కిరణ్, డి అజయ్, విజయ్, అభి, గౌతమ్, వినయ్, స్థానిక పెద్దలు నాయకులు అంజయ్య గౌడ్, కే కుమార్, ఎన్ మహేష్, జి సత్యనారాయణ, జి సత్తయ్య, దశరథ్, ఎన్ కుమార్, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాగ్దేవి జూనియర్ , ఒకేషనల్ కళాశాలల విజయభేరి

*** ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసిన కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్**



యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన ఫలితాలలో స్టేట్ ర్యాంకులు సాధించడం శ్రీ వాగ్దేవి జూనియర్ ,ఒకేషనల్ జూనియర్ కళాశాల ఘనతగా అని చైర్మన్ పల్లి ప్రవీణ్ కుమార్ అన్నారు. అదేవిధంగా అన్ని గ్రూపులలో ప్రథమ స్థానంలో నిలవడం ఎంపీసీ ప్రథమ సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ విభాగంలో 452/470 సీఈసీ విభాగంలో 460/500 ద్వితీయ సంవత్సరం విభాగంలో సిఇసి విభాగంలో లింగారి దీపికకు 911/1000, ఎర్రోళ్ల శ్రావణి 887/100 అదేవిధంగా ఒకేషనల్ కోర్సులలో ఈ సంవత్సరం ప్రారంభించగా ఫిజియో థెరపీ, అగ్రికల్చర్, కంప్యూటర్ సైన్స్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్, ఎలక్ట్రికల్ టెక్నాలజీ , అకౌంట్స్ అండ్ టాక్సేషన్ కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుండి ప్రారంభిస్తున్నామని కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ అన్నారు. దీనికి సహకరించిన విద్యార్థులు తల్లిదండ్రులకు అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నవీన్ కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించినందుకు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా కొత్తగా ప్రారంభించిన ఒకేషనల్ కోర్సులలో మంచి మార్కులు సాధించడం ఎంతో అభినందనీయం అన్నారు. కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ ప్రిన్సిపల్ కొలను శ్రావణ్ రెడ్డి శ్రీ సాయి కృప డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ యాకూబ్ బాబా వైస్ ప్రిన్సిపాల్ మహేందర్ ,వీరయ్య, కృషి ఐటిఐ ప్రిన్సిపాల్ నామోజు రమేష్, అశోక్ , శ్యాం కుమార్ , శ్రీకాంత్ ,మోహిన్, మల్లేశం, రామకృష్ణ ,రామాంజనేయులు, హారిక, దీపిక పాల్గొన్నారు.

## మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుచే భారత రాష్ట్ర సమితి రజితోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాస్ఫూర్తి, కాప్రా : వరంగల్లో జరగబోయే భారత రాష్ట్ర సమితి రజితోత్సవ సమావేశాలకు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుచే పాలకుర్తి నియోజకవర్గం కార్యకర్తలతో బహిరంగ సభ పోస్టర్ రజక సంఘాల సమితి గ్రేటర్ హైదరాబాద్ యూత్ ప్రెసిడెంట్ గుమ్మడి రాజు యాకయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.




## రజితోత్సవ మహాసభకు విజయవంతం చేయండి


*** ఉపసర్పంచ్ పల్లెపాటి మాధవులు**



యాదగిరిగుట్ట , (ప్రజాస్ఫూర్తి ) : మల్లాపురం బీఆర్ఎస్ కార్యకర్తల : సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సాధనకై ఏర్పడిన పార్టీ బీఆర్ఎస్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని రజితోత్సవ మహాసభకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సభను విజయవంతం చేయాలని ఆలేరు మాజీ శాసనసభ్యులు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి నాయకత్వంలో యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్య కి సహకారంతో మాజీ తాజా ఉపసర్పంచ్ పల్లెపాటి మాధవులు ఆధ్వర్యంలో మల్లాపురం బీఆర్ఎస్ అభిమానులు కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని రజితోత్సవ సభను విజయవంతం చేయాలని అన్నారు మరియు రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం దొంగ హామీలు ఇచ్చి మోసపోయిన తెలంగాణ ప్రజలకు మనోధైర్యం ఈ సభ జరుగుతుందని కార్యకర్తలకు తెలిపారు ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మంద కృష్ణ, మాజీ వార్డు సభ్యులు కర్రె చంద్రశేఖర్, దేవరుప్పల నరేందర్, దుద్దులు సిద్ధులు పుచ్చుల రాములు, గుజ్జ కనకరాజు, పల్లెపాటి సత్యనారాయణ, కర్రె మధు తదితరులు పాల్గొన్నారు.

## బాటసారుల దాహర్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం

**బాలానగర్ జోన్ డిసిపి సురేష్ కుమార్**





కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ): బాటాపారుల దాహర్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడుతాయని బాలానగర్ జోన్ డిసిపి సురేష్ కుమార్ అన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధి షాపూర్ నగర్ ఎక్స్ రోడ్ లో జీడిమెట్ల పోలీసులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయనతో పాటు బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్లు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసు లో భాగంగా స్థానికంగా ఉండే ప్రజలని కూడా ఇందులో భాగస్వాములను చేశామన్నారు. వేసవికాలం మొదలవడంతో ప్రజల దాహర్తి తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడుతాయన్నారు. బాలానగర్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం బాలానగర్ ఏసీపీ హనుమంతరావును , జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ ను, జీడిమెట్ల పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రకాశం స్టేడియం సమస్యలు పరిష్కరించండి

* స్టేడియంలో మీటింగ్లకు వ్యాపార అవసరాలకు ఇవ్వవద్దు
* తాగుబోతులకు అడ్డాగా మారకుండా చూడాలి
* క్రీడాకారుల కోసం స్టేడియంలో సౌకర్యాలు కల్పించాలి
* జలాల్ సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్







ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: 100 సంవత్సరాలు చరిత్ర కలిగిన సింగరేణి ప్రకాశం స్టేడియం సమస్యల లోగిళ్లలో కొట్టుమిట్టాడుతుందని సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రాండ్ లో క్రీడాకారులు ఉదయం ,సాయంత్రం వాకింగ్, రన్నింగ్ చేసుకునేందుకు అనువుగా లేకుండా ఉంటుందని మందుబాబులకు అడ్డాగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకాశం స్టేడియం ను రాజకీయ సభలకు వ్యాపార సమావేశాలు కార్యక్రమాల కోసం ఇవ్వవద్దని ఆయన అన్నారు. ఉదయం పూట వాకింగ్ రన్నింగ్ కి ఇతర ప్రాక్టీసు చేసుకునేందుకు వస్తున్న క్రీడాకారులకు తీవ్ర సౌకర్యంగా ఉంటుండడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్టేడియంలో క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మందుబాబులు స్టేడియం ను ఉపయోగించుకోకుండా చూడాలని సింగరేణి ఈవెంట్స్ ఏ కాకుండా స్థానిక క్రీడాకారులు చేసుకునే అన్ని రకాల ఈవెంట్స్ కు ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా ఉపయోగించుకునేలా చూడాలని క్రీడాకారులను సింగరేణి ప్రోత్సహించాల్సిన అవసరం కూడా ఉందని ఆయన గుర్తు చేశారు. కార్మికుల శ్రమతో సింగరేణి నిలబడి ఉందని ఆ కార్మికుల పిల్లలు క్రీడాకారులుగా ఈ వందేళ్ళ స్టేడియం చరిత్రలో ఎంతోమంది ఈ ప్రాంతం నుంచి క్రీడాకారులుగా నిలదొక్కుకున్నారని అందులో సింగరేణి పాత్ర కూడా ఉందని ఆయన తెలిపారు. క్రీడాకారులను మరింత ప్రోత్సహించేందుకు సింగరేణి యాజమాన్యం స్టేడియంలో సౌకర్యాలు కల్పిస్తూ అన్ని విధాలుగా ప్రోత్సహించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## అధికారంలోకి వస్తాం.. అతి చేసే అధికారులపై చర్యలు తీసుకుంటాం: కేటీఆర్




హైదరాబాద్: ఏప్రిల్ 27న నిర్వహించనున్న భారాస రజతోత్సవానికి వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామానికి చెందిన మహిళలు విరాళం ఇచ్చారు. తెలంగాణ భవన్‌లో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు ఆ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. లగచర్ల మహిళలు విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. భూసేకరణ వివాదం తలెత్తిన సమయంలో కొందరు పోలీసులు మహిళలపై అసభ్యంగా ప్రవర్తించారని, ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ), జాతీయ మహిళా కమిషన్‌ను కలిశామని చెప్పారు. ''సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ వ్యవహార శైలిని, పోలీసుల తీరును ఎన్‌హెచ్ఆర్సీ తీవ్రంగా తప్పుబట్టింది. ఎన్‌హెచ్ఆర్సీ నివేదిక తర్వాతైనా రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి. బాధ్యులైన పోలీసులను సర్వీసు నుంచి తొలగించాలి. లేదంటే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తాం. హైకోర్టు స్టే ఇచ్చినా భూసేకరణ చేస్తున్నారని తెలిసింది. దానిని వెంటనే నిలిపివేయాలి. మూడేళ్లలో మా పార్టీ అధికారంలోకి వస్తుంది. అతి చేసే అధికారులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం'' అని కేటీఆర్ అన్నారు.

### లిటిల్ మేధావి స్కూల్

## విద్యార్థుల పర్యావరణ చైతన్య ర్యాలీ





బుద్వేల్, ఏప్రిల్ 22 (ప్రజా స్ఫూర్తి): ధృథ్వి దినోత్సవాన్ని పురస్కరించుకొని బుద్వేల్‌లోని లిటిల్ మేధావి స్కూల్ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు "మన శక్తి, మన గ్రహం" అనే నినాదంతో ఓ చైతన్యభరిత ర్యాలీ నిర్వహించారు. ప్లేకార్డులు, నినాదాలతో ఊహించ దగిన ఉత్సాహంతో పాల్గొన్న విద్యార్థులు పర్యావరణ రక్షణ పట్ల తమ చొరవను చాటిచెప్పారు. పరిమిత వయస్సులోనే భూమి రక్షణ పట్ల బాధ్యతను తీసుకుంటూ చైతన్యాన్ని




పెంపొందిస్తున్న విద్యార్థుల ఉత్సాహం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. వారి సందేశాలు, ప్రతిబింబించిన అవగాహన .. భవిష్యత్తును పచ్చదనంతో ముడిపెట్టే దిశగా దోహదపడతాయని స్పష్టమైంది. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, "విద్యార్థుల సృజనాత్మకత, చొరవ గర్వించదగినది. ఇటువంటి కార్యక్రమాలు పర్యావరణం పట్ల బాధ్యతను అలవర్చే అవకాశాలుగా నిలుస్తాయి. చిన్న గొంతులైనా పెద్ద మార్పు తీసుకురాగలవని ఈ ర్యాలీ మరోసారి రుజువు చేసింది" అన్నారు. మన భూమిని సంరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం ముగిసింది.

## ఇంటర్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన భాగ్యరధి జూనియర్ కళాశాల విద్యార్థులు





కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ): ఇంటర్ ఫలితాలలో చింతల్ భాగ్యరధి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో తమ సత్తా చాటుకున్నారు. వివిధ గ్రూపులలో విద్యార్థులు రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకులు సాధించి అత్యుత్తమ మార్కులతో కళాశాల గౌరవాన్ని పెంచారు.ఈ సందర్భంగా . కళాశాల ప్రిన్సిపల్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సీనియర్ బైపీసీ గ్రూపులో ఆఫ్షన్ జేబీన్ 996/1000 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించుకున్నారు. ఎంపీసీ గ్రూపులో ఎల్.రవీన 990/1000 మార్కులతో, సీఈసీ గ్రూపులో షాహిమా 983/1000 మార్కులతో, ఎంఈసీ గ్రూపులో బి.నందిని 983/1000 మార్కులతో రాష్ట్రస్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్మీడియట్ లోనూ సానియా బేగం (ఎంఈసీ గ్రూపు) 495/500 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. బైపీసీ గ్రూపులో ఎండి.అవేజ్ 435/440 మార్కులు, ఎంపీసీ గ్రూపులో ఎల్.అంజలి 463/470 మార్కులు, సీఈసీ గ్రూపులో ఎస్.అనూష 480/500 మార్కులు సాధించి కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచారన్నారు. రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులకు ద్వితీయ సంవత్సరానికి పూర్తి ట్యూషన్ ఫీజును మాఫీ చేస్తున్నామని తెలిపారు. భాగ్యరధి కళాశాల తక్కువ ఫీజుతో అత్యున్నత ఫలితాలు అందించడంలో ముందుందన్నారు. ఈ ఏడాది రెండు రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు సిహెచ్.గోవిందరెడ్డి, కె.రామకృష్ణ, జి.రమేష్ బాబు, నల్ల జై శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల

తెలంగాణ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఫలితాలను విడుదల చేశారు. ఇంటర్ ఫలితాల్లో బాలికలు సత్తాచాటారు. ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో 66.89 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 73.83 శాతం, బాలురు 57.83 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ పరీక్షలకు 4,88,430 మంది హాజరు కాగా 3,22,191 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 71.37 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, బాలికలు 74.21 శాతం, బాలురు 57.31 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ పరీక్షలకు 5,08,582 మంది హాజరు కాగా... 3,33,908 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాల కోసం ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ https://results.cgg.gov.in/లో చూడోచ్చు. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేసి, రిజల్ట్ చూసుకోవచ్చు.

### ఫిక్సింగ్ ఆరోపణలు...

## ఖండించిన రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా ఏప్రిల్ 19వ తేదీన లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో రాజస్థాన్ రాయల్స్ 2 పరుగుల తేడాతో ఓడిపోయింది. దీనిపై రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ తాత్కాలిక అడ్‌హక్ కమిటీ కన్వీనర్ జయదీప్ బిహానీ సందేహాలు లేవనెత్తాడు. ఈ మ్యాచ్ ఫిక్స్ అయ్యిందని తీవ్రమైన ఆరోపణలు చేశాడు. ఈ వ్యాఖ్యలను రాజస్థాన్‌రాయల్స్ యాజమాన్యం ఖండించింది. బిహానీపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి, క్రీడా మంత్రి, క్రీడా కార్యదర్శికి అధికారికంగా ఫిర్యాదూ చేసింది. అలాగే... రాజస్థాన్ రాయల్స్ టీమ్‌కు చెందిన సీనియర్ అధికారి దీప్ రాయ్.. ఈ వ్యాఖ్యలను తోసిపుచ్చారు. 'బిహానీ చేసినవి తప్పుడు ఆరోపణలు. అవి నిరాధారమైనవి' అని ఖండించారు. మరో వైపు జయదీప్ బిహానీ జట్టు ప్రదర్శనపై అనుమానం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. రాజస్థాన్ రాయల్స్, రాజస్థాన్ స్పోర్ట్స్ కౌన్సిల్, భారత క్రికెట్ నియంత్రణ మండలి.. రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ తాత్కాలిక




కమిటీని ఐపీఎల్ సంబంధిత కార్యకలాపాల నుంచి పక్కన పెట్టడానికి కుట్ర పన్నాయని ఆరోపించారు. అయితే ఈ వాదనలపై రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం తీవ్ర అభ్యంతరం తెలిపింది. "బిహానీ చేసిన అన్ని ఆరోపణలను మేం ఖండిస్తున్నాం. ఇటువంటి బహిరంగ ప్రకటనలు తప్పుదారి పట్టించడమే కాకుండా రాజస్థాన్ రాయల్స్, రాయల్ మల్టీ స్పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, రాజస్థాన్ స్పోర్ట్స్ కౌన్సిల్, బీసీసీఐ ఖ్యాతి, విశ్వసనీయతకు తీవ్ర నష్టం కలిగించాయి. అవి క్రికెట్ సమగ్రతను కూడా దెబ్బతీశాయి' అని ఆగ్రహం వ్యక్తం చేసింది. 'బీసీసీఐ ప్రస్తుత ఏర్పాట్ల ప్రకారం, ఈ సీజన్ కోసం జైపూర్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించే అధికారిక హక్కులను రాజస్థాన్ స్పోర్ట్స్ కౌన్సిల్ కలిగి ఉంది. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకత్వంలో కౌన్సిల్, బీసీసీఐతో సమన్వయంతో పనిచేస్తున్నాం' అని రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా... ఓ సందర్భంలో బిహానీ మాట్లాడుతూ.. 'గతంలో రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ (RCA) రాష్ట్రంలో అంతర్జాతీయ మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించింది. కానీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ తాత్కాలిక అడ్‌హక్ కమిటీని జైపుర్‌లో జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌లకు దూరంగా ఉంచుతున్నారు. రాజస్థాన్ స్పోర్ట్స్ కౌన్సిల్ క్రీడా ప్రయోజనాలకు వ్యతిరేకంగా కుట్ర చేస్తోంది. వారు ఈవెంట్‌కు సంబంధించిన సభ్యులకు కనీసం అక్రిడిటేషన్ కార్డులను కూడా తయారు చేయలేదు' అని ఆరోపించారు.

### రోజుకు 5 లీటర్ల పాలు తాగుతాడన్న వార్తలపై

## ధోనీ రియాక్షన్


భారత క్రికెట్ దిగ్గజం, చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ, తన ఆహారపు అలవాట్ల గురించి, కండబలం గురించి ఎన్నో సంవత్సరాలుగా చలామణిలో ఉన్న కొన్ని విపరీతమైన వదంతులపై ఎట్టకేలకు స్పందించారు. ముఖ్యంగా తాను రోజూ ఐదు లీటర్ల పాలు తాగుతాననే ప్రచారాన్ని, వాషింగ్ మెషీన్‌లో భారీ పరిమాణంలో లస్సీ చేసుకుంటాననే పుకార్లను ఆయన నవ్వుతూ కొట్టిపారేశారు. క్రికెట్ ప్రపంచంలోకి ధోనీ అడుగుపెట్టిన తొలినాళ్లలో, ఆయన అద్భుతమైన ఫిట్‌నెస్, మైదానంలో బంతిని బలంగా బాదే సామర్థ్యం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇదే సమయంలో ఆయన ఆహారపు అలవాట్లపై అనేక ఊహాగానాలు మొదలయ్యాయి. ముఖ్యంగా, ధోని రోజూ ఐదు లీటర్ల పాలు తాగుతారని, అదే ఆయన భారీ సిక్సర్ల వెనుక రహస్యమని ఒక బలమైన వదంతి దేశవ్యాప్తంగా వ్యాపించింది. దీనికి తోడు, ఆయన వాషింగ్ మెషీన్‌లో లీటర్ల కొద్దీ లస్సీని తయారుచేసుకుంటారని మరో వింత పుకారు కూడా షికారు చేసింది. ఇటీవల చెన్నైలో జరిగిన ఒక ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ధోనీని, ఈ ఏళ్లనాటి వదంతుల గురించి మీడియా మిత్రులు అడిగారు. దీనికి ధోనీ నవ్వుతూ, "నేను రోజుకు ఐదు లీటర్ల పాలు తాగుతానా?" అని బదులిచ్చారు. ఆ తర్వాత అసలు విషయం చెబుతూ, "నేను బహుశా రోజంతా కలిపి ఒక లీటరు పాలు తాగేవాడినేమో. కానీ రోజుకు ఐదు లీటర్లు తాగడం అనేది ఎవరికైనా చాలా కష్టమే" అని స్పష్టం చేశారు. అలాగే, వాషింగ్ మెషీన్‌లో లస్సీ తయారు చేసుకునే వదంతి గురించి ప్రస్తావించగా, ధోని మరింతగా నవ్వేశారు.





# ఫ్యాషన్‌లోనూ పర్యావరణహితమే..!

మనసుకి నచ్చిందల్లా కొనేసి.... కొన్నాళ్లు వాడి పక్కన పడేసే యువతరం తీరు మారింది. మినిమలిజాన్ని అనుసరిస్తూనే... తమ అలవాట్లతో పాటూ ఫ్యాషన్ ఎంపికల్లోనూ పర్యావరణంపై ప్రేమను చాటుకుంటోంది జెన్‌జీ తరం. అందుకేనేమో, రీయూజబుల్, బయోడిగ్రేడబుల్... అంటూ గత కొన్నాళ్లుగా ఫ్యాషన్ ప్రపంచంలో 'సస్టెనబుల్' రకాల సందడి పెరిగింది. అలాగని ఈ ట్రెండ్ దుస్తులకే పరిమితం కాలేదు. లోలాకులు, గాజులు, గొలుసులు, యాక్సెసరీలు... ఇలా ఒకటేమిటి అన్నింటికీ ఈ సూత్రమే కొనసాగుతోంది. మెటల్ రకాలకు బదులు త్రెడ్, క్లాత్ వంటివి ఉపయోగించి చేసిన నయా జ్యుయెలరీ ఇప్పుడు వారి మనసు దోచేస్తోంది. తేలిగ్గా ఉండటం, రీయూజ్ చేసుకోగలగడం, భూమిలోనూ త్వరగా కలిసిపోగలగడంతో వీటిని ఎంచుకుంటోందీతరం. అందుకే, నచ్చిన రంగుల్లో ఎంబ్రాయిడరీ, పెయింటింగ్ వంటి సోకులు చేర్చిన ఈ నగల్ని ఎంపిక చేసుకుని మురిసిపోతున్నారు అమ్మాయిలు. మీరూ ఆ డిజైన్లను చూడండి... నచ్చేస్తాయి మరి.















# బిజినెస్ BUSINESS



## దూసుకెళ్తున్న బంగారం ధర.. లక్ష దాటేసి ఇంకా పైపైకి!

దిల్లీ: దేశీయంగా లక్ష రూపాయల మార్క్ దాటి ఆల్‌టైమ్ గరిష్ఠాలకు చేరిన బంగారం ధర.. మరింత పైకి చేరింది. సోమవారం సాయంత్రం తొలిసారి లక్ష రూపాయలు దాటిన 10 గ్రాముల మేలిమి పసిడి ధర.. తాజాగా మరో రూ.2 వేలు పెరిగింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి రూ.1,02,000కు చేరింది. అంతర్జాతీయంగా చూస్తే ఔన్సు బంగారం ధర (31.10 గ్రాములు) 3,467 డాలర్లు పలుకుతోంది. అటు మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీలోనూ 10 గ్రాముల పసిడి ధర లక్ష రూపాయలకు చేరువైంది. వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ దీని ధర పెరిగింది. జూన్ నెల డెలివరీ కాంట్రాక్ట్ ధర మంగళవారం ఇంట్రాడేలో రూ.1,899 పెరిగి రూ.99,178కి చేరింది. ఆపై రూ.98,880కు తగ్గింది. ఆగస్టు కాంట్రాక్ట్ ధర రూ.99,800 వద్ద కొనసాగుతుండగా.. అక్టోబర్ కాంట్రాక్ట్ గోల్డ్ మాత్రం ఏకంగా రూ.2వేలు పెరిగి లక్ష రూపాయల మార్కు దాటేసింది.

**అక్షయ తృతీయపై ప్రభావం?**

సాధారణంగా అక్షయ తృతీయకు ఎంతోకొంత బంగారం కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. కానీ, బంగారం ధరలు రికార్డుస్థాయిలో ఉండడంతో కొనుగోలుదారులు వెనకడుగు వేస్తున్నారు. అటు బంగారం వర్తకుల్లోనూ ఇదేతరహా అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొనుగోళ్లు తగ్గే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అక్షయ తృతీయ రోజు నాటికి (ఏప్రిల్ 30న) బంగారం కాస్త అయినా తగ్గుతుందేమోనని చూస్తున్నారు. ఒకవేళ ఇదేస్థాయిలో ధరలు కొనసాగితే ఆ మేర అమ్మకాలపై కొంత మేర ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**కారణమేంటి?**

టారిఫ్‌ల విషయంలో అమెరికా ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాల దిశగా ప్రయత్నాలు చేస్తోంది. మరో వైపు చైనాతో మాత్రం వివాదం కొనసాగిస్తోంది. అయితే, వడ్డీ రేట్ల కోత విషయంలో ఫెడ్ చీఫ్ జెరోమ్ పోవెల్, ట్రంప్ మధ్య వివాదం నెలకొంది. దీంతో అమెరికా ఆర్థిక వ్యవస్థ గురించి, ఆ దేశ రుణాల గురించి మదుపర్లలో ఆందోళన నెలకొంది. మరోవైపు చైనా సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులు బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తుండడంతో పసిడి ధర పెరుగుతోందని అనలిస్టులు పేర్కొంటున్నారు.

## ఈ ఏడాది 7 శాతం పెరగనున్న సిమెంట్ డిమాండ్ - క్రిసిల్



ఈ ఆర్థిక సంవత్సరంలో భారత సిమెంట్ రంగం డిమాండ్ 6.50-7.50% పెరిగే అవకాశం ఉందని క్రిసిల్ అంచనా వేసింది. ముఖ్యంగా దేశంలో మౌలిక సదుపాయాల వ్యయం పెరగడం, ఈ సీజన్‌లో రుతుపవనాలు ఆశాజనకంగా ఉంటాయనే అంచనాలు ఉండడం వల్ల గ్రామీణ గృహాల నిర్మాణాలు ఊపందుకుంటాయని, అందుచేత సిమెంట్ రంగానికి డిమాండ్ పెరుగుతుందని ఒక అంచనా. మౌలిక సదుపాయాల పరంగా..రోడ్లు, రైల్వే రంగాలు సిమెంట్ డిమాండ్‌ను పెంచుతాయని క్రిసిల్ ఇంటెలిజెన్స్ నివేదించింది. అంతేకాకుండా ప్రభుత్వ పథకాల జోరు, వడ్డీ రేటు కోతల ప్రభావం వల్ల పట్టణ గృహ నిర్మాణ రంగం కూడా పుంజుకుంటుందని అంచనా. ప్రధాన మౌలిక సదుపాయాల మంత్రిత్వ శాఖలకు బడ్జెట్ కేటాయింపులలో 10 శాతం పెరుగుదల, సాధారణం కంటే ఎక్కువ రుతుపవనాలు వ్యవసాయ లాభదాయకతను పెంచుతాయని, తద్వారా గ్రామీణ గృహ డిమాండ్ పెరుగుతుందని క్రిసిల్ ఇంటెలిజెన్స్ నివేదిక తెలిపింది.దేశీయ సిమెంట్ డిమాండ్‌లో 29-31 శాతం వాటా కలిగిన మౌలిక సదుపాయాలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా కీలకమైన సిమెంట్ డిమాండ్‌కు అనుగుణంగా ఉంటాయని నివేదిక తెలిపింది. మౌలిక సదుపాయాలలో రోడ్లు అతిపెద్ద వాటాదారుగా ఉన్నాయి, తరువాత రైల్వేలు, నీటిపారుదల, పట్టణ మౌలిక సదుపాయాలు ఉన్నాయి.

## ఎయిర్‌టెల్ చేతికి అదానీ డేటా నెట్‌వర్క్స్ స్పెక్ట్రమ్!




దిల్లీ: ప్రముఖ టెలికాం నెట్‌వర్క్ భారతీ ఎయిర్‌టెల్, తన అనుబంధ సంస్థ భారతీ హెక్సాకామ్ కలిసి అదానీ గ్రూప్‌తో ఒప్పందం చేసుకుంది. అదానీ డేటా నెట్‌వర్క్స్‌కు చెందిన 26 GHz బ్యాండ్‌లోని 400 మెగాహెర్జ్ స్పెక్ట్రమ్‌ను వినియోగించుకునేందుకు డీల్ కుదుర్చుకుంది. తద్వారా ఎయిర్‌టెల్ తన 5జీ సామర్థ్యాలను, నెట్‌వర్క్ కెపాసిటీని పెంచుకోనుంది. నియంత్రణ సంస్థల ఆమోదానికి లోబడి ఈ లావాదేవీ పూర్తి కానుంది. ఈ డీల్‌కు సంబంధించిన ఆర్థిక వివరాలు తెలియరాలేదు. 2022లో నిర్వహించిన స్పెక్ట్రమ్ వేలంలో అదానీ డేటా నెట్‌వర్క్స్ 400Mhz స్పెక్ట్రమ్‌ను రూ.212 కోట్లకు దక్కించుకుంది. మొత్తం ఆరు సర్కిళ్ల పరిధిలో ఉన్న ఈ స్పెక్ట్రాన్ని డీల్‌లో భాగంగా ఎయిర్‌టెల్ వినియోగించుకోనుంది. గుజరాత్ (100 MHz), ముంబయి (100 MHz), ఆంధ్రప్రదేశ్ (50 MHz), రాజస్థాన్ (50 MHz), కర్ణాటక (50 MHz), తమిళనాడు (50 MHz)లోని స్పెక్ట్రమ్‌ను ఎయిర్‌టెల్ వాడుకోనుంది. అదనపు స్పెక్ట్రమ్ వల్ల అధిక వేగంతో కూడిన డేటాను వినియోగదారులకు అందించడంతో పాటు, నెట్‌వర్క్ సామర్థ్యాన్ని మరింత పెంచుకుని నాణ్యమైన సేవలను యూజర్లకు అందించడంలో ఎయిర్‌టెల్‌కు ఇది దోహదపడుతుంది.

## రామ్‌దేవ్ బాబా వ్యాఖ్యలు షాక్‌కు గురిచేశాయి : దిల్లీ హైకోర్టు

యోగా గురువు రామ్‌దేవ్ బాబాపై దిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. హమ్‌దర్ద్ పానీయం విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఏమాత్రం సమర్థనీయం కావని పేర్కొంది. కొన్ని రోజుల క్రితం హమ్‌దర్ద్ షర్బత్ గురించి రామ్‌దేవ్ బాబా పరోక్షంగా తీవ్ర ఆరోపణలు చేశారు. దానిని కొనుగోలు చేయడం వల్ల వచ్చే లాభాలను కంపెనీ వేరొక వర్గానికి చెందిన నిర్మాణాలు చేపట్టేందుకు ఉపయోగిస్తోందన్నారు. "అదే ఈ షర్బత్ (పతంజలి సంస్థకు చెందిన పానీయం) తాగితే.. గురుకులా లను నిర్మించవచ్చు. పతంజలి విశ్వవిద్యాలయాన్ని విస్తరించవచ్చు" అంటూ రామ్‌దేవ్ మాట్లాడారు. దానికి సంబంధించిన వీడియో వివాదాస్పదమైంది. ఈ క్రమంలో హమ్‌దర్ద్ కంపెనీ దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. వెంటనే ఆ వీడియోను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది.

# టెక్నాలజీ TECHNOLOGY

## స్మార్ట్‌ఫోన్లు, పీసీల తయారీ కేంద్రంగా భారత్

* **అమెరికా – చైనాల మధ్య వాణిజ్య యుద్ధ ప్రభావం**
* **మనదేశం వైపు దృష్టి సారిస్తున్న అంతర్జాతీయ సంస్థలు**
* **కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక**



ముంబై: అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం భారత్‌కు అనూకూలంగా మారుతోంది. అంతర్జాతీయ స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాబ్‌లు/వ్యక్తిగత కంప్యూటర్ (పీసీలు) సంస్థలు తమ ఉత్పత్తి కర్మాగారాలను చైనా నుంచి భారత్‌కు తరలించే అంశాన్ని పరిగణలోకి తీసుకుంటున్నాయి. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక ప్రకారం అగ్రరాజ్యల మధ్య సుంకాల విధింపులు, ప్రతీకార టారిఫ్‌ల ఉద్రికత్తలు కొనసాగితే.., అంతర్జాతీయ స్మార్ట్‌ఫోన్ల మొత్తం ఉత్పత్తిలో డ్రాగన్ దేశపు వాటా 2026 నాటికి 55 శాతానికి పడిపోయే వీలుంది. గత సంవత్సరం(2024) ఈ వాటా 64 శాతంగా ఉంది. ఇదే సమయంలో భారత్ నుంచి ముఖ్యంగా అమెరికాకు యాపిల్, శాంసంగ్ ఎగుమతులు జోరందుకోనున్నాయి. అంతర్జాతీయ స్మార్ట్‌ఫోన్ల మొత్తం ఉత్పత్తిలో భారత్ వాటా 2026 నాటికి 25-28 శాతానికి చేరొవచ్చు. కాగా గత సంవత్సరంలో ఈ వాటా 18 శాతంగా ఉంది.

* అంతర్జాతీయంగా ఐఫోన్ల ఉత్పత్తి విలువలో భారత్ ఎగుమతుల వాటా ప్రస్తుతం 20 శాతంగా ఉంది. ఇది 2025-26కల్లా 25 శాతానికి, 2026-27 నాటికి 35 శాతానికి చేరుతుందని కౌంటర్‌పాయింట్ అంచనా వేస్తోంది.
* ల్యాప్‌ట్యాబ్‌లు/ పీసీల మొత్తం తయారీలో చైనా వాటా 2026 నాటికి 68-70 శాతానికి దిగివచ్చే అవకాశం ఉంది. 2024లో ఈ వాటా 75 శాతంగా ఉంది. అంతర్జాతీయ ల్యాప్‌ట్యాబ్‌ల ఉత్పత్తిలో భారత్ వాటా 2026 నాటికి ఏడు శాతానికి చేరుకోవచ్చు. 2024లో భారత్ వాటా కేవలం నాలుగు శాతంగా ఉంది.
* ''ల్యాప్‌ట్యాబ్‌లు, పీసీలు చైనా నుంచే అధికంగా దిగుమతి అవుతున్నాయి. వాణిజ్య వార్ నేపథ్యంలో హెచ్‌పీ, డెల్ ఇతర సంస్థలు తమ ఉత్పత్తి స్థావరాలు చైనా నుంచి భారత్‌కు మారిస్తే అంతర్జాతీయంగా దేశీయ మార్కెట్ వాటా పెరగడమే కాకుండా ఎగుమతులు సైతం గణనీయంగా పెరుగుతాయి. భారత్ సైతం ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంపై దృష్టి సారించింది. ఇప్పటికే ఐటీ హార్డ్‌వేర్ రంగాన్ని ప్రోత్సహించే దిశగా కేంద్రం 'మేక్ ఇన్ ఇండియా' 'ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం' వంటి పథకాలు ప్రవేశపెట్టింది'' అని ఇండియన్ సెల్యూలర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) సభ్యుడొకరు తెలిపారు.
* అంత సులువేం కాదు: చైనా నుంచి తయారీ కర్మాగారాలను భారత్‌కు తరలించడం అంత సులువు కాదని కాన్లేస్ నివేదిక చెబుతోంది. డెల్ సంస్థ ల్యాప్‌ట్యాబ్‌ల ఉత్పత్తి 79% చైనాలో ఉండగా, మిగిలినదంతా వియత్నాంలో ఉంది. కాన్లేస్ రిపోర్ట్ ప్రకారం 2026 నాటికి డెల్ తన తయారీ సామర్థ్యాన్ని సగానికిపైగా వియత్నాంకు తరలించనుంది. లెనివో సైతం వియత్నాంను ప్రత్యమ్నాయ దేశంగా చూస్తోంది. చైనాలో 85% తయారీ సామర్థ్యం ఉన్న హెచ్‌పీ.. 2026 కల్లా మెక్సికో, తైవాన్ దేశాలకు 45% మార్చనుంది.



## బిగ్ బ్యాటరీ, కర్వ్ డిస్‌ప్లేతో వివో కొత్త 5జీ ఫోన్

ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ వివో కొత్త 5జీ (Vivo T4 5G) స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. టి సిరీస్‌లో వివో టి4 5జీ పేరిట దీన్ని కంపెనీ లాంచ్ చేసింది. బిగ్ బ్యాటరీ, 90W ఫాస్ట్ ఛార్జింగ్, కర్వ్ డిస్‌ప్లేతో ఈ ఫోన్ వస్తోంది. ఫోన్ ధర, ఫీచర్లతో పాటు అమ్మకాల వివరాలు ఇప్పుడు చూద్దాం.. వివో టి4 5జీ 6.77 అంగుళాల ఫుల్ హెచ్‌డీ+ అమోలెడ్ క్వాడ్ కర్వ్‌డ్ డిస్‌ప్లేతో వస్తోంది. 120Hz రిఫ్రెష్‌రేటు, 5000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో తీసుకొచ్చారు. స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జనరేషన్ 3 ప్రాసెసర్‌ను అమర్చారు. ఆండ్రాయిడ్ 15తో కూడిన ఫన్‌టచ్ ఓఎస్ 15 ఉన్నాయి. వెనుక వైపు 50 ఎంపీ కెమెరా, 2 ఎంపీ సెకండరీ కెమెరా ఉన్నాయి. ముందువైపు 8 ఎంపీ కెమెరా ఇచ్చారు. ఇక బ్యాటరీ విషయానికొస్తే ఇందులో 7,300 mAh బ్యాటరీ ఉంది. 90W ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. ఇన్ డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్, ఐపీ65 రేటింగ్‌తో వస్తోంది. ఈ ఫోన్ మొత్తం మూడు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీ+128జీబీ వేరియంట్ ధర రూ.21,999, 8జీబీ+256జీబీ వేరియంట్ ధర రూ.23,999; 12జీబీ+256జీబీ వేరియంట్ ధర రూ.25,999గా కంపెనీ నిర్ణయించింది. ఎమరాల్డ్ బ్లేజ్, ఫాంటమ్ గ్రే రంగుల్లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్, వివో ఇండియా ఇస్టోర్‌తో పాటు ఎంపిక చేసిన రిటైల్ స్టోర్లలో కొనుగోలు చేయొచ్చు.


# పచ్చని కశ్మీరంలో ఉగ్ర కల్లోలం!



మంచుకొండలు, పచ్చికబయళ్లతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించేందుకు ఏటా కోట్లాది మంది దేశ విదేశీ యాత్రికులు జమ్మూకశ్మీర్‌లో పర్యటిస్తుంటారు. కేంద్ర గణాంకాల ప్రకారం గడిచిన దశాబ్దం కాలంలోనే ఇలా 15.3 కోట్ల మంది ఇక్కడ పర్యటించినట్లు అంచనా. ప్రపంచవ్యాప్తంగా ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు పాశవిక దాడులకు పాల్పడటం కలవరపెడుతోంది. తాజా పహల్గాంలో పాశవిక దాడి నేపథ్యంలో 2000 నుంచి ఇప్పటివరకు జమ్మూ కశ్మీర్‌లో జరిగిన కొన్ని ఉగ్రదాడులను పరిశీలిస్తే..

* మార్చి 21, 2000: అనంత్‌నాగ్ జిల్లాలో ఛత్తీసింగ్‌పొర గ్రామంలో మార్చి 21 రాత్రి సమయంలో సిక్కు వర్గం లక్ష్యంగా ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 36 మంది ప్రాణాలు కోల్పోయారు.
* ఆగస్టు 2000: అమర్‌నాథ్ యాత్రికులను లక్ష్యంగా చేసుకొని నున్‌వాన్ బేస్ క్యాంప్‌పై ముష్కరులు దాడులకు తెగబడ్డారు. యాత్రికులు సహా మొత్తం 32 మందిని ఉగ్రవాదులు పొట్టనపెట్టుకున్నారు.
* జులై 2021: అమర్‌నాథ్ యాత్రికులే లక్ష్యంగా ఉగ్రవాదులు మళ్లీ దాడులు చేశారు. అనంత్‌నాగ్‌లోని శేష్‌నాగ్ బేస్ క్యాంప్‌పై దాడిలో 13 మంది చనిపోయారు.
* అక్టోబర్ 1, 2001: శ్రీనగర్‌లోని జమ్మూకశ్మీర్ అసెంబ్లీ కాంప్లెక్స్‌పై ఉగ్రవాది ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు. ఆ ఘటనలో 36 మంది ప్రాణాలు కోల్పోయారు.
* 2002: అమర్‌నాథ్ యాత్రికులే లక్ష్యంగా చందన్‌వాడీ బేస్ క్యాంప్‌పై ముష్కరులు మరోసారి దాడికి పాల్పడ్డారు. ఆ దాడిలో 11 మంది సామాన్యులు చనిపోయారు.
* నవంబర్ 23, 2002: జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై దక్షిణ కశ్మీర్‌లోని లోయర్ ముండా ప్రాంతంలో ఐఈడీ పేలుడులో 19 మంది చనిపోయారు. వీరిలో తొమ్మిది మంది భద్రతా సిబ్బంది, ముగ్గురు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు.
* మార్చి 23, 2003: పుల్వామా జిల్లా నందిమార్గ్ గ్రామంలో కశ్మీరీ పండిట్‌లపై దాడులకు తెగబడ్డ ఉగ్రవాదులు.. 24 మందిని ఊచకోత కోశారు. వారిలో 11 మంది మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు.
* జూన్ 13, 2005: పుల్వామాలోని ఓ ప్రభుత్వ పాఠశాల ముందున్న రద్దీ మార్కెట్‌లో కారుదాడిలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఇద్దరు విద్యార్థులు, ముగ్గురు సీఆర్‌పీఎఫ్ అధికారులు కూడా ఉన్నారు. మరో 100 మంది గాయాలతో బయటపడ్డారు.
* జూన్ 12, 2006: కుల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో తొమ్మిది మంది నేపాల్, బిహార్‌లకు చెందిన కూలీలు ప్రాణాలు కోల్పోయారు.
* జూన్ 10 2017: కుల్గాంలోనే అమర్‌నాథ్ యాత్ర బస్సుపై దాడి చేసి ఎనిమిది మందిని పొట్టనపెట్టుకున్నారు.
* పుల్వామా దాడి 2019: ఫిబ్రవరి 14, 2019లో పుల్వామాలో జరిగిన దాడి యావత్ దేశాన్ని కలవరపాటుకు గురిచేసింది. సైనికులు వెళ్తున్న వాహనంపై దాడి చేసి 40 మంది సీఆర్‌పీఎఫ్ సైనికులను పొట్టనపెట్టుకున్నారు. ఆ ఘటనలో ఓ ఉగ్రవాది కూడా హతమయ్యాడు.
* 2024లోనూ జమ్మూకశ్మీర్‌లో అనేక ఉగ్రదాడి ఘటనలు జరిగాయి. పహల్గాంలో పర్యటక జంటపై మిలిటెంట్లు దాడికి పాల్పడ్డారు. నవంబర్

## అమ్మ లేదు.. నాన్న ప్రోత్సాహం వల్లే.. : సివిల్స్ రెండో ర్యాంకర్ హర్షిత గోయల్



యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో గుజరాత్‌కు చెందిన హర్షిత గోయల్ రెండో ర్యాంకుతో సత్తా చాటారు. సివిల్స్‌లో ఇంత అద్భుత విజయం సాధించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. తన కుటుంబం నుంచి తానే మొదటి సివిల్ సర్వెంట్ కాబోతున్నానన్నారు. సివిల్స్ లక్ష్యం వైపు ప్రయాణంలో తన కుటుంబం నుంచి ఎంతో మద్దతు లభించిందని ఆమె తెలిపారు. తల్లి లేకపోయినా.. తన తండ్రి అన్ని విధాలుగా ఎంతగానో ప్రోత్సహించారని ఈ సందర్భంగా హర్షిత గుర్తు చేసుకున్నారు. తన స్నేహితులూ సపోర్టు చేశారన్నారు. ప్రజల జీవితాల్లో, మరీ ముఖ్యంగా మహిళల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ఐఏఎస్ కావాలనుకుంటున్నట్లు ఆమె వెల్లడించారు.


*** రేయింబవళ్లు కష్టపడి చదివింది.. సివిల్స్ టాపర్ శక్తి దూబే తల్లిదండ్రులు**

మరోవైపు, సివిల్స్‌లో తమ కుమార్తె శక్తి దూబే ప్రథమ ర్యాంకు సాధించడం పట్ల ఆమె తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె తల్లి ప్రేమ దూబే మాట్లాడుతూ.. దేవుడి ఆశీస్సుల వల్లే తన కుమార్తె ఇంత గొప్ప విజయం సాధించిందన్నారు. రాత్రింబవళ్లు కష్టపడి చదివిందని తెలిపారు. ప్రస్తుతం శక్తి దూబే ఢిల్లీలో ఉందని.. బుధవారం ఇంటికి వస్తుందని ఆమె తెలిపారు. తన కుమార్తె విజయంలో తాను పోషించిన పాత్ర కేవలం అవసరమైన వాటిని అందుబాటులో ఉంచడం ఒక్కటేనని శక్తి దూబే తండ్రి దేవేంద్ర కుమార్ దూబే అన్నారు. భగవంతుడి ఆశీస్సులు, కఠోర శ్రమ వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. ఈ ఫలితాల పట్ల ఎంతో సంతోషంగా ఉన్నట్లు చెప్పారు. తాను పోలీస్ శాఖలో పనిచేస్తుండటంతో ఎక్కువగా బయటే ఉంటానని.. కుమార్తె విజయంలో తన భార్య పాత్రే ఎక్కువంటూ చెప్పుకొచ్చారు.

## పాఠాలు బోధించేందుకు కాదు.. స్నేహితుడిలా వచ్చాం: జేడీవాన్స్

భారత్‌తో వాణిజ్య ఒప్పంద చర్చలకు రోడ్‌మ్యాప్ ఖరారైందని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తెలిపారు. యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు విధించిన తరుణంలో వాన్స్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం భారత్ పర్యటనలో ఉన్న ఆయన వాణిజ్య ఒప్పందం దిశగా ప్రధాని మోదీతో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే . ''వాణిజ్య చర్చలకు సంబంధించిన నిబంధనలను అమెరికా, భారత్ అధికారికంగా ఖరారు చేశాయి. ట్రంప్ మోదీ దార్శనికతను సాకారం చేసుకునే దిశగా ఇది కీలక అడుగని నేను భావిస్తున్నాను. మన దేశాల మధ్య ఒప్పందానికి ఇది రోడ్‌మ్యాప్‌గా మారనుంది'' అని వాన్స్ అన్నారు. రాజస్థాన్ రాజధాని జైపుర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ''మన బంధాన్ని బలోపేతం చేసుకోవడానికే మేం ఇక్కడకు వచ్చాం. మీరు ఇలాగే చేయాలని అని పాఠాలు చెప్పడానికి మేం రాలేదు. గతంలో అలా జరిగింది. తక్కువ వేతనాలకు కార్మికులను అందించే దేశంగా భారత్‌ను గత ప్రభుత్వాలు చూశాయి. విమర్శలు చేశాయి. మన రెండు దేశాలు శ్రామిక శక్తిని గౌరవించే భాగస్వాములు. ప్రజాస్వామ్య ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభుత్వం ఇదే. మోదీకున్న ప్రజామోద రేటింగ్‌లు నాకు అసూయ కలిగించేలా ఉన్నాయి. ఇదే విషయాన్ని మోదీ వద్ద ప్రస్తావించాను. అమెరికాతో పాటు భారత్ అభివృద్ధి చెందాలని ట్రంప్ కోరుకుంటున్నారు. మన రెండు దేశాల భాగస్వామ్యం వృద్ధి చెందాలన్నదే ట్రంప్ ఆకాంక్ష. ఇక భారత శిల్పాకళా నైపుణ్యం నన్ను అబ్బురపరిచింది. భారత్.. చరిత్ర, సంప్రదాయాలతో సుసంపన్నమైంది. భవిష్యత్తు పట్ల భారత్ దార్శనికత మెచ్చుకోదగినది. అభివృద్ధి చెందేందుకు భారత్‌లో ఎన్నో అవకాశాలున్నాయి.

## తీవ్ర దిగ్భ్రాంతికరం.. క్షమించరాని ఘటన: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



దిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడి ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దీన్ని అత్యంత హేయమైన ఘటనగా పేర్కొన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ 'ఎక్స్' వేదికగా పోస్టులు పెట్టారు. ''పహల్గాం ఉగ్రదాడి దిగ్భ్రాంతికరం. ఇదొక క్రూరమైన, అమానవీయ చర్య. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం భయానకం. ఇది క్షమించరానిది. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా'' అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పోస్ట్ చేశారు.

*** వారిని వదిలిపెట్టం : ప్రధాని మోదీ**

పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన.. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. అత్యంత హేయమైన ఈ చర్య వెనుక ఉన్నవారిని చట్టం ముందుకు తీసుకొస్తామని.. వారిని వదిలిపెట్టబోమన్నారు. ఉగ్రమూకల దుష్ట ఎజెండా ఎప్పటికీ విజయవంతం కాదన్నారు. ఉగ్రవాదంపై పోరాడాలనే తమ సంకల్పం దృఢమైనదన్న ప్రధాని.. అది మరింతగా బలపడుతుందని స్పష్టంచేశారు.

*** తీవ్ర ఆవేదన కలిగించింది: ఏపీ సీఎం చంద్రబాబు**

పహల్గామ్‌లో అమాయకులైన పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి ఘటన తీవ్ర ఆవేదనకు గురిచేసిందని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఉగ్రమూకల పాశవిక ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపిన సీఎం.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

*** దొంగ దెబ్బలతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు: సీఎం రేవంత్ రెడ్డి**

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రకాల్పుల్లో పదుల సంఖ్యలో పర్యాటకులు మృతిచెందిన ఘటనపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యను ఖండించారు. ఇలాంటి దొంగదెబ్బలతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరన్నారు. ఉగ్రవాద మూకల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తూ.. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

*** తీవ్ర పరిణామాలు ఎదుర్కొకోక తప్పదు: గజేంద్ర సింగ్ షెకావత్**

ఉగ్రదాడి ఘటనపై కేంద్ర పర్యటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దీన్ని పిరికిపంద చర్యగా పేర్కొన్న ఆయన.. ఈ కిరాతక దాడికి పాల్పడిన వారు తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

*** ఉగ్రదాడుల కారకుల్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు: కిషన్‌రెడ్డి**

జమ్మూకశ్మీర్ ఉగ్రదాడి ఘటన పట్ల కలతచెందినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ''మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేస్తున్నా. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జాతి మొత్తం ఏకతాటిపై ఉంటుంది. అమాయక పౌరులపై ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య'' అన్నారు.

## ముర్షిదాబాద్ అల్లర్లకు బయటి వ్యక్తులే కారణం: మమతా బెనర్జీ



కోల్‌కతా: వక్ఫ్ (సవరణ) చట్టం అమలుకు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌లో నిరసనలు ఉద్రిక్తంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ.. ముర్షిదాబాద్ అల్లర్లకు బయటి నుంచి వచ్చిన వ్యక్తులే కారణమని మండిపడ్డారు. బెంగాల్ సరిహద్దుల నుంచి అక్రమంగా రాష్ట్రంలోకి ప్రవేశించిన కొందరు గూండాలు యువకులను రెచ్చగొట్టి ఉద్రిక్తతలకు కారణమయ్యారని ఆమె అన్నారు. ఈ హింసాకాండ వెనుక ఉన్న కుట్రదారులను త్వరలోనే ప్రజలముందుకు తీసుకువస్తానని అన్నారు. హింసలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరపున చెరోరూ.10 లక్షలు పరిహారం ఇస్తామని ప్రకటించారు. మే నెల మొదటి వారంలో అల్లర్లు జరిగిన ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తానని వెల్లడించారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న బంగ్లార్ బారి పథకం కింద వారి ఇళ్లను కూడా పునర్నిమిస్తామని హామీ ఇచ్చారు. శనివారం బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ అల్లర్ల బాధితులను, మృతుల కుటుంబాలను పరామర్శించారు. వక్ఫ్ సవరణ చట్టం 2025కు వ్యతిరేకంగా ఇటీవల ముర్షిదాబాద్‌లో చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. బెంగాల్‌లోని మాల్డా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగి.. రోడ్లను దిగ్బంధించారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.